జన్మభూమి మా ఊరు సభలో వందలాది మంది మైనార్టీ మహిళలు, ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి విన్నవించారు. బుధవార కొత్తపల్లె ఉర్దూ పాఠశాలలో జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రేషన్‌కార్డులు, పింఛన్లు, పక్కా గృహాలు, ఇంటి స్థలాల మంజూరు, తాగునీటి, డ్రైనేజీ సమస్యలపై వినతులు వెల్లువచ్చాయి. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌రాజు, డిఇ సుబ్రమణ్యం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రజల వినతులపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని ఆయన సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం బలోపేతానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఐసిడిఎస్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ నసిబూన్‌ఖానం, కో ఆప్షన్ సభ్యులు సలావుద్దీన్, కౌన్సిలర్ ఫయాజుర్ రహమాన్, మైమున్నీసా, వైసిపి నాయకులు రిజ్వాన్, జాకీర్, అల్తాప్ పాల్గొన్నారు.

బాధిత కటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి పెండ్లిమర్రి

నూతన సంవత్సర వేడుకల్లో మండలంలోని ఇందిరానగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను బుధవారం మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి పరామర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మృతి చెందిన కుటంబాలకు ఒక్కొక్కరికి పదివేలు, గాయపడ్డ వారికి ఒక్కొక్కరికి ఐదువేల చోప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఎరికలరెడ్డి చంద్ర, బ్రహ్మంరెడ్డి పాల్గొన్నారు.

నవచరిత్రకు శ్రీకారం



చిన్నారికి పంచామృతం తినిపిస్తున్న ముఖ్యమంత్రి

ప్రపంచంలోని ప్రముఖ సంస్థలను రప్పించి రైతుల ముఖాల్లో వెలుగులు చూస్తా నని తెలిపారు. లింగాల దేశంలోనే ఉత్తమ వ్యవసాయక్షేత్రంగా మారుతుందని తెలిపారు. రాయలసీమ సరుకులను ప్రపంచ మార్కెట్లో విక్రయించే రోజులు వస్తాయన్నారు. చిత్రావతి నీటిని విడుదల చేసి పంటలను కాపాడతానని తెలిపారు. చేపల పెంపకంతో అధిక ఆదాయం సమకూరుతోందని తెలిపారు. సీమ చెరువుల్లో చేపల పెంపకం చేపట్టాలన్నారు. భారతదేశం మీ దగ్గర నేర్చుకునే రోజులు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో ప్రసంగిస్తూ స్వచ్ఛభారత్, విద్య, వికాసం, మౌలిక సదుపాయాలు సుపరిపాలన, సహజన వనరుల, విజన్, స్వర్ణాంధ్రప్రదేశ్, పేదరికంపై గెలుపు, నెలకు పది వేల రూపాయల ఆదాయం సాధన లక్ష్యమని తెలిపారు. టెక్నాలజీ ద్వారా పార దర్శకత పెంచుతామని తెలిపారు. ఫైబర్‌గ్రిడ్ ప్రాజెక్టు ద్వారా రూ.149లకే 500 ఛానళ్లు, మూడు టెలి ఫోన్లు, నెట్‌ను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా పెళ్లికానుక కార్యక్రమాన్ని చేపడతామన్నారు.

క్యాన్సర్, గుండె, సుగర్, కిడ్నీ సమస్యలను అద్యయనం చేసి చికిత్స అందిస్తామని తెలిపారు. వ్యవసాయం, ఆరోగ్యం, వినోదం వివరాలను తెలుసుకుని నూతన వ్యవస్థకు శ్రీకారం చుడు తున్నామని తెలిపారు. ప్రతి కుటుంబంలో ఇద్దరికి పింఛన్ల అంశాన్ని పరిశీలిస్తామన్నారు. ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్న గండికోట ఉత్సవాల లోగోను ఆవిష్కరించారు. అనంతరం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ కీ.శే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ రూ.1300 కోట్లతో సిబిఆర్ నిర్మాణానికి కేటాయించారని, ఇందులో 1100 కోట్లను ఖర్చు చేసి 85 శాతం పూర్తి చేయించారన్నారు. ముఖ్యమంత్రి లేచి వినమ్మా విను, ఇది రాజకీయ వేదిక కాదని, నా కార్యక్రమానికి వచ్చి ఇష్టానుసారంగా మాట్లాడతానంటే కుదరదని, పేపర్లో రాసిస్తే మాట్లాడతానని చెప్పి మైక్ కట్ చేయాలని సంజ్ఞ చేశారు. అయినప్పటికీ మాట్లాడటానికి ప్రయత్నించిన ఎంపీని దబాయించడంతో వేదికపై నుంచి దిగిపోయారు. అనంతరం సిఎం మాట్లాడుతూ పులివెందులకు 1600 కొత్తపింఛన్ల మంజూరు, 7,31 కోట్లతో తాగు నీటి కుళాయి కనెక్షన్లు, 6.4 కి.మీ భూగర్భడ్రెయినేజీ, 38 కి.మీ వర్షపునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు, ఏడు పార్కుల నిర్మాణానికి 5.70 కోట్లతో మొత్తం 41.33 కోట్ల అభివృద్ధి పనులను మం జూ రు చేస్తు న్నట్లు ప్రకటించారు. అనంతరం ట్రాన్స్‌జెండర్లు, సాధికారమిత్రలు, మహిళా పోలీస్ వాలంటర్ల నియా కాలకు గ్రీన్‌సిగ్నల్ ప్రకటించారు. అంతకుముందు మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, ఆదినారా యణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, శాసనమండలి మాజీ ఉపాధ్యక్షులు ఎస్.విసతీష్‌రెడ్డి ప్రసం గించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బిటెక్ రవి, సివిల్‌సప్లయ్స్ కార్పొరేషన్ చైర్మన్ లింగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బ్రహ్మయ్య, వరద రాజులరెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే జయ రాములు, టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి, విశ్వనాధనాయుడు, రామ్‌గోపాల్‌రెడ్డి, పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

మహిళలకు ఆదర్శం సావిత్రిబాయి పూలే



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పవన్‌కుమార్

ప్రజాశక్తి - కడపఅర్బన్

భారతదేశం తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే మహిళలకు ఆదర్శనీయమని బ్లడ్2లివ్ సంస్థ వ్యవస్థాపకులు పట్టుపోగుల పవన్‌కుమార్ అన్నారు. బుధవారం నగరంలోని గుంతబజార్‌లో రాస్ మానసిక వికలాంగుల పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దార్మనిక బహుమానవియ్య కృషి కార్ సంస్థ జిల్లా అధ్యక్షులు మాదినేని నిత్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ, పురుషులు, కులమతాలు అతీతంగా విద్యనభ్యసించడం సహజమైన హక్కు ఉంటుందని పేర్కొన్నారు. అందుకే అందరూ చదవాలని, సమానంగా జీవించాలని అను నిత్యం తపించిన సామాజిక విప్లవ మాతృమూర్తి సావిత్రిబాయి అని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ ఫొటో గ్రాఫర్ విస్సు రాయల్, డిబిఎంకె సభ్యులు శివజ్యోతి, సాయి, సురేంద్ర, రాస్ సూపర్‌వైజర్ లలితమ్మ, పద్మావతి, చంద్రకళ, వరలక్ష్మి, జయశ్రీ పాల్గొన్నారు.

గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు డి.రూత్ ఆరోగ్య మేరి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. పూలే చిత్ర పటానికి ప్రధానోపాధ్యాయులు సత్యసుజాత పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె 19వ శతాబ్దపులో సంకెళ్లను తెంచి సమాజంలో దళితులకు, మహిళలకు, వితంతువులకు, బాలికలకు విద్య విద్య నేర్పించారని పేర్కొన్నారు. మహిళలను పశువులకంటే దారుణంగా చూసే ఆ రోజుల్లో సావిత్రిబాయి తొలి భారతీయ ఉపాధ్యాయిని కావడం గొప్పవిషయమని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రూత్ ఆరోగ్యమేరి మాట్లాడుతూ చిన్న వయస్సులోనే సావిత్రిబాయిని పూణేలోని పూలే కుటుంబంలో13 ఏళ్ల జ్యోతిరావ్‌కిచ్చి వివాహం చేశారని పేర్కొన్నారు. జ్ఞానతృష్ణ కలిగిన జ్యోతిరావు పూలే ఆమెను మొదట శిష్యురాలిగా చేసుకుని తన భావాలను, ఆలోచనలను, భవిష్యత్తు ప్రణాళికలను ఆమెతో పంచుకున్నారని తెలిపారు. ఆమె పుట్టిన రోజును జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. అనంతరం జెవివి ప్రచురించిన సావిత్రిబాయి పూలే కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న జడ్జి

చిల్డ్రన్స్ హోమ్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - కడప

జిల్లా న్యాయసేవా అధికార సంస్థ (డిఎల్ఎస్ఎ) సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి యు.యు.ప్రసాద్ బుధవారం ప్రభుత్వ అబ్జర్వేసన్‌హోం, చిల్డ్రన్స్ హోమ్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను పరిశీలించారు. 63 మంది పిల్లలతో మాట్లాడి అందుతున్న సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయం వివరించారు. ప్రభుత్వ అబ్జర్వేషన్ హోంలోని పదిమంది పిల్లల వివరాలు తెలు సుకున్నారు. కార్యక్రమంలో హోం సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై వినతి పత్రం

ప్రజాశక్తి - కడపఅర్బన్

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఎపి ఎడిటర్స్ అండ్ జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యనారాయణ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తజిఒ పేరులో కాలయాపన చేయకుండా 208-19 సంవత్సరానికి అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టులకు కనీస విద్యార్హత నిబంధన సడలించాలని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాను వర్కింగ్ జర్నలిస్టుల చట్టములోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. త్రిబుల్ బెడ్‌రూము నిర్మించి ఇవ్వాలని కోరారు. చిన్న దినపత్రికలు, వార, పక్ష, మాసపత్రికలకు ప్రభుత్వ ప్రకటనలు ఇవ్వాలన్నారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను నిలువరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వృత్తిభద్రత, విధి నిర్వహణలో భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో జర్నలిజం కోర్సులను ప్రవేశపెట్టాలని కోరారు.

ఉచితంగా ఇంటర్ విద్య

కడపఅర్బన్ : ఇంటర్ స్థాయిలో కార్పొరేట్ విద్యను హాస్టల్ సౌకర్యంతో ఉచితంగా అందజేస్తున్నట్లు ఫౌండేషన్ ఫర్ ఎకనామిక్ అండ్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ జిల్లా ఇన్‌ఛార్జీ చాంద్‌బాషా చెప్పారు. బుధవారం నగరపాలక సంస్థ ఉర్దూ ఉన్నత పాఠశాలలో నోటిఫికేషన్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసక్తిగల ముస్లిమ్ మైనార్టీలు బాలురు తమపేర్లు ఈనెల 25లోపు అందజేయాలని కోరారు.. ఉచిత విద్య కోసం ప్రవేశ పరీక్ష ప్రొద్దుటూరు, రాయచోటిలో ఈనెల 28న, కడపలో ఫిబ్రవరి నాలుగున నిర్వహిస్తామని తెలిపారు.

ఆర్మీ ర్యాలీలో 4174 మందికి పరీక్షలు

ప్రజాశక్తి - కడప

జిలా యువజన సర్వీసుల శాఖ (స్టెప్) ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో ప్రారంభరోజు ప్రకాశం, అనంతపురం జిల్లాలకు చెందిన 4174 మంది పాల్గొన్నారు. వీరికి పరుగుపందెం, పులప్స్, లాంగ్‌జంప్ వంటి అంశాలలో పరీక్షలు నిర్వహించారు. 4174 మందిలో ఫిజికల్ ఫిట్‌నెస్‌లో 610 మంది పాస్ అయినట్లు స్టెప్ సిఇఒ టి.మమత తెలిపారు. మొదటి రోజు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఎంపికలకు విశేష స్పందన లభించినట్లు తెలిపారు.



యువకులకు నంబర్లు వేస్తున్న సిబ్బంది

7 జిల్లా స్థాయి మల్లయుద్ధ పోటీలు

ప్రజాశక్తి -కడప

జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7న జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా స్థాయి మల్లయుద్ధం పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు నూనె నగేష్, కార్యదర్శి షేక్ యూనుస్‌బాష తెలిపారు. జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ సహకారంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు మెడల్స్, మెమొంటోలు, సర్టిపికెట్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పోటీల రోజు మధ్యాహ్నం క్రీడాకారులకు భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంక్రాంతి సంబరాలను పురష్కరించుకొని పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కుటుంబ సంక్షేమంపై శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి - కడప

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంచ కుటుంబ సంక్షేమంపై శ్రద్ధ వహించాలని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధానాచార్యులు డాక్టర సుబ్బనరసయ్య పేర్కొన్నారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ఎన్‌సిసి, ఎస్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆరోగ్యం-ఆనందం అంశంపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టారు. కరపత్రాలు పంచుతూ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుబ్బనరసయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రధానంగా శ్రద్ధ వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏ పని అయినా సక్రమంగా నిర్వర్తించగలమన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని తెలిపారు.

నగర శివారులో షార్ట్‌ఫిల్మ్

ప్రజాశక్తి - కడపఅర్బన్

నగరంలోని శివారు ప్రాంతంలో శరవేగంగా నవరస భరితుడు షార్ట్‌ఫిల్మ్‌ను నిర్వహిస్తున్నారు. బుధవారం షూటింగ్‌ను షాట్స్‌ను దర్శకులు సుభాష్ నటులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ నిర్మాత లలిత సహకారంతో వీణా ప్రింటర్స్ అధినేత శంకరాచారి షార్ట్ ఫిల్మ్‌లో ప్రధాన పాత్రను పోసిస్తున్నారని చెప్పారు. త్వరంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని పేర్కొన్నారు. నటనపై ఆసక్తి ఉన్నవారు తమ సంస్థలో సంప్రదించాలని కోరారు. నటీనటులు వి.వెంకటేష్, ఎస్.లలిత, శ్రీనాథ్, కెమెరమెన్ వీరబోయిన శివతేజ, స్టిల్ ఫొటోగ్రాఫర్ శ్రీను పాల్గొన్నారు.



షూటింగ్‌లో సన్నివేశాలు వివరిస్తున్న సుభాష్



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపల్ సుబ్బనరసయ్య

సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కడపఅర్బన్

ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి) సెమిస్టర్ ఫలితాలను అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ డాక్టర్ పి.హరిప్రసాద్, కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్బనరసయ్య విడుదల చేశారు. బుధవారం కళాశాలలో ఫలితాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017, నవంబర్, డిసెంబర్‌లో నిర్వహించిన సెమిస్టర్ పరీక్షల్లో గణనీయమైన ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు. సెమిస్టర్ ఒకటి, మూడు, ఐదు పరీక్షలను ఫలితాలు ప్రకటించారు. ఫైనలియర్ విద్యార్థులు బిఎ గ్రూపులో 86శాతం, బికాం గ్రూపులో 89శాతం, బిఎస్సీలో 94శాతంతో విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ డాక్టర్ ఎం.రమేష్, స్టాఫ్ కౌన్సిల్ సభ్యులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు. ఫలితాలను gcmkadapa.org వెబ్‌సైట్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు ఎముకల సాంద్రత పరీక్షలు

ప్రజాశక్తి - కడపఅర్బన్

నగరంలోని పాలెంపాపయ్య వీధిలో ఉన్న యాఫియా క్లినిక్‌లో ఉచిత ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ అమీర్‌బాష తెలిపారు. బుధవారం క్లీనిక్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవికాస్ సేవా సమితి సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. ఉచిత పరీక్షలతో పాటు మందులు ఇస్తామని చెప్పారు. ఎంతో మంది కీళ్లనొప్పులతో బాధపడుతున్నారని తెలిపారు. రుతుక్రమం ఆగిపోయిన స్త్రీలు, వయసు 45 సంవత్సరాలు దాటిన వారు, ఆహారంలో కాల్షియం పదార్థాలు తక్కువ తీసుకునేవారు, స్టిరాయిడ్ మందులు వాడేవారు, ఆపరేషన్ ద్వారా గర్భసంచి తొలగించుకున్నవారు, మద్యపానం, స్మోకింగ్ చేసేవారు తప్పక సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో సమితి అధ్యక్షులు తాహీర్ పాల్గొన్నారు.

6 డిగ్రీ కళాశాలలకు పెనాల్టీ


కడపఅర్బన్ : వైవీయూ పరిధిలోని డిగ్రీ కళాశాలలకు సంబంధించిన అఫిలియేషన్ ప్రక్రియలో భాగంగా ఆరు కళాశాలలు వివిధ కారణాలతో ఛార్జీస్ సర్చ్ చేయడంపై పెనాల్టీ విధించినట్లు వైఈయూ విసి రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం విచారణ కమిటీ తన నివేదికను విసికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌వియూ కళాశాల అభివృద్ధి మండలి డీన్ రామకృష్ణా, వైవీయూ మెటీరియల్ సైన్స్, నానోటెక్నాలజీ విభాగం ఆచార్యులు డాక్టర్ శంకర్‌తో కూడిన కమిటీని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. తప్పుడు సమాచారం ఇచ్చి విశ్వవిద్యాలయాన్ని తప్పుదారి పట్టించారని స్పష్టంగా ఉందని రిజిస్ట్రార్ చంద్రయ్య తెలిపారు. కమిటీ సిఫార్సు మేరకు రూ.4లక్షల ఎనిమిది వేలు పెనాల్టీని విధించినట్లు చెప్పారు. ప్రతి కళాశాల ఛార్జీస్ సర్స్ చేసిన నోటిసులలో పేర్కొన్న లోపాలను సరిచేసుకుని పూర్తి స్థాయిలో 2018-19 సంవత్సరంలో నిర్వహించే అఫిలియేషన్ తిరిగి దరఖాస్తు చేసుకోవాలని నిబంధన విధించినట్లు తెలిపారు. అఫిలియేషన్ ప్రక్రియ అనేది కేవలం ఒక పరిపాలనా సంబంధిత వ్యవహారమని దీనితో విద్యార్థులను ఎటువంటి నష్టం కలగకుండా, విద్యాసంవత్సరానికి భంగం కలగకుండా వ్యవహరించామని చెప్పారు. వైవీయూ అఫిలియేషన్ ప్రక్రియలో తప్పుడు సమాచారమిచ్చిన అధికారులను, యాజమాన్యాలపై అత్యంత పారదర్శకమైన రీతిలో చర్యలను చేపట్టినట్లు పేర్కొన్నారు.

అంధుల ఆపద్బంధువు లూయిస్ బ్రెయిలీ



నేడు బ్రెయిలీ జయంతి

అంధుల ఆపద్బంధువు బ్రెయిలీ. ఆయన్ను అందరూ ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్తున్నారు. అంధులు అందరిలా సులభంగా చదివేందుకు ఓ లిపిని సృష్టించిన మహానుభావుడు. ప్రపంచ చూడలేని వారికి అండగా నిలిచాడు. ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా అంధుల పాఠశాలను నెలకొల్పాడు. చూపులేదని కుంగిపోకుండా నిరంతర కృషితో ముందుకెళ్లాడు. పుట్టుకతోనే అంధుడు కాడు.. తన చిన్నతనంలో జరిగిన ప్రమాదం వల్ల చూపు కోల్పోయాడు. ప్రస్తుతం చూపులేని వారందరికీ ఆదర్శ ప్రాయుడిలా నిలిచాడు..



ప్రజాశక్తి - కడప అర్బన్

అంధుల ప్రపంచానికి లిపి ద్వారా వెలుగును ప్రసాదించిన చిరస్మరణీయుడు లూయిస్ బ్రెయిలీ. 1809, జనవరి 4న ప్యారిస్‌కు సమీపంలోని క్రూనే అనే గ్రామంలో జన్మించారు. మూడేళ్ల ప్రాయంలోనే తన ఇంటి చుట్టూ కేరింతలు కొడుతూ ఆడుకుంటూ తండ్రి తయారు చేసే గుర్రపు జీన్లను తదేకంగా పరిశీలించేవారు. అతని కళ్లకు అప్పుడు ప్రపంచంలోని ప్రతి వస్తువు ఎంతో అందంగా కనిపించేంది. పనిముట్లు బ్రెయిలీని ఎంతగానో ఆకట్టుకునేవి. ఒక రోజు తల్లిదండ్రులు తమ పనిలో నిమగ్నమై ఉండగా వారికి తెలియకుండా ఒక చిన్న తోలు ముక్క తీసుకుని వారిని అనుకరించడంలో ప్రమాదవశాత్తు కత్తి ఎగిరి కంట్లో గుచ్చుకోవడంతో కంటి నుంచి రక్తం ధారగా కారింది. కంగారు పడ్డ తల్లిదండ్రులు వెంటనే కంటి వైద్యుని వద్దకు తీసుకు పోయినా ఫలితంలేకపోయింది. దీంతో కంటి చూపు కోల్పోవాల్సి వచ్చింది. చిన్నతనంలోనే కన్ను పోగొట్టుకున్న కుమారుడిని చూసి తల్లిదండ్రులు ఎంతో ఆవేదనకు గురయ్యారు. మరి కొన్నాళ్లకు రెండవ కన్ను కూడా చూపు కోల్పోవడంతో బ్రెయిలీ పూర్తిగా గుడ్డివాడయ్యాడు. దీంతో అతని కుటుంబ సభ్యులు బ్రెయిలీ జీవితం ఎంతో దుర్భరంగా మారిందని మానసికంగా ఎంతో కృంగిపోయారు.

అంచనాలను తారుమారు చేసి..


పువ్వుపుట్టగానే పరిమ ళిస్తుందన్నట్లు తల్లిదండ్రుల అంచనాలు తారుమారు చేసి ఆ పసిబాలుడు తన అక్కా చెల్లెలతో కలిసి పాఠశాలలు వెళ్లేవాడు. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు శ్రద్ధగా విని చక్కగా జ్ఞాపకం పెట్టుకునే వాడు. విన్న విషయాన్ని పరీక్షల్లో జవాబుగా రాసి మంచి విద్యార్థిగా పేరు తెచ్చుకున్నాడు. అతని సూక్ష్మ గ్రహణశక్తికి ఉపాధ్యాయులు సైతం నివ్వరపోయేవారు. 1784లో ప్యా రిస్‌లో వాలంటిస్ హవే ప్రపంచంలోనే మొట్టమొదటి అంధుల పాఠశాలను స్థాపించారు. అంధ విద్యార్థులకు అక్షరాలు వేళ్లతో తడిమి గుర్తుపెట్టే విధంగా కాగితంపై అక్షరాల ఆకారాన్ని ఉబ్బెత్తుగా ఉండేలా రూపొందించారు. దీన్నే లైన్‌టైప్ అని పిలిపించేవారు. ఈ విధంగా ప్రపంచములోనే మొట్టమొదటి అంధుల పాఠశాల నిర్మాతగా పేరు గాంచాడు. అంధుడైన లూయి విద్యాభ్యాసం కోసం హవే స్థాపించిన స్కూల్లో 1819లో చేరాడు. ప్రారంభంలో లూయి కూడా లైన్‌టైప్ పద్ధతి ద్వారా విద్యాభ్యాసం చేసి ఎంతో తెలివిగల విద్యార్థిగా పేరు తెచ్చుకున్నాడు. ఆ తరువాత 17 ఏట అదే స్కూల్లో ఉపాధ్యా యుడిగా పని చేశాడు. అంధుల కోసం ఏదైన చేయాలనే తపన లూయిస్‌లో ఎక్కువగా ఉండేది. ఉన్నతస్థాయిలో ఉండాలని ఎక్కువగా అభిలషించేవాడు. పగలంతా ఉపాధ్యా యుడిగా విద్యార్థులకు పాఠాలు బోధిస్తునే రాత్రి వేళల్లో వారి కోసం ప్రత్యేకంగా లిపిని రూపొందించాలనే ఆలోచించేవాడు. 1832లో మొదటి ఆరు చుక్కల కొత్త లిపిని రూపొందించారు. ఆ చుక్కల ద్వారా అక్షరమాలలోనే ప్రతి అక్షరాన్ని ఉత్సారనను అనుసరించిన గుర్తులను లెక్కలకు సంబంధించిన సాంకేతిక పదాలను, సంగీతానికి సంబంధించిన గుర్తులను (చిహ్నాలను) తేలికగా రాయించాడు. ఈ లిపిని ఇంటివద్ద బోధించడానికి తొలి ప్రయత్నం చేశాడు. తాను రూపొందించిన లిపి అధి కారుల గుర్తింపు సంపాదించడానికి లూయి ఎంతో శ్రమ పడ్డారు. ఈ క్రమంలో ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. దాంతో ఆయన తన ఉపాధ్యాయ వృత్తిని కూడా వందులుకోక తప్పలేదు. అయినప్పటికీ లూయి తన ప్రయత్నాన్ని విరమించుకుకోలేదు. 1851 నాటికి ఆయన ఆరోగ్యం పూర్తిగా విషమించింది. 1952లో మృతి చెందాడు. తమ గురువు రూపొందించిన లిపికి గుర్తింపు లభించకపోవడంతో అంధ విద్యార్థులు ఎంతో వేదనకు గురయ్యారు. ఎలాగైనా గుర్తింపు తీసుకురావాలనే ఉద్దేశంతో బ్రెయిల్ లిపిని అధికారింగా గుర్తిం చాలంటూ అంధ విద్యార్థులు ఎన్నో ఉద్యోమాలు చేశారు. వారు ఉధ్యమాలు చేపట్టిన 30 ఏళ్ల తరువాత బ్రెయిలీ లిపిని అధికారింగా గుర్తించారు. ప్రపంచంలోనే ఇతర దేశంలోనూ లిదే లిపిని ఉపయోగిస్తున్నారంటే బ్రెయిలీ లిపికి ఎంత ఆదరణ ఉందో అర్థమవుతుంది.

కడప నగరంలో 1949, అక్టోబరు 26 తేదీన అంధుల ప్రాధమిక పాఠశాలను ప్రారంభించారు. మొదట్లో పాఠశాలలో కేవలం ఒక్క విద్యార్థి ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేవారు. 1953లో వివేకానందమూర్తి చలువతో బాలాజీ ఆడిటోరియంలో దేవేంద్ర సభ డ్రామాను ప్రదర్శించి దాని ద్వారా వచ్చిన ఆదాయంలో స్కూల్‌లో రెండు గదులు కట్టించిన్నట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. డాక్టర్ వి.చంద్ర మౌళి ఆధ్వర్యంలో ఏడవ తరగతి గదులు పాఠశాలలకు ప్రహరీ గోడలు నిర్మించారని చెప్పారు. ఎంపి రామమునిరెడ్డి తన సొంత నిధుల నుంచి ఆరు లక్షలతో రెండులతో పాటు ఎనిమిది మరుగుదొడ్లను, ఎంపి వివేకానందరెడ్డి లక్షల రూపాయలతో ఒక రూమును నిర్మించినట్లు తెలిపారు. ఇప్పటి వరు దాదాపు 780 విద్యార్థులు విద్యను అభ్యసించినట్లు పేర్కొన్నారు. అటెండర్ల నుంచి అధ్యాపకుడు, బ్యాకింగ్, ఆర్‌టిసి, పోలీస్ ఇలా అన్ని శాఖల్లో ఉద్యోగాలు పని చేస్తున్నారని ఎంతో గర్వంగా చెప్పారు. నాగేంద్రన్, ఎ.వెంకటరత్నం ఉపా ధ్యాయులు, హైదరాబాదులో ఇండస్ట్రీయల్‌లో పని చేస్తున్న మహబూబ్‌బాషకు రాష్ట్ర పతి అవార్డు వచ్చినట్లు తెలిపారు. గవర్నర్ మాదవన్ చెందులాల్ త్రివేది కడపకు వచ్చిన సందర్భంగా పాఠశాలకు గేటును బహుకరించారు. విజిటర్స్ పుస్తకంలో ఇంతవరకు తాను చూసిన అంధుల పాఠశాల అన్నింటిలో కడప అంధుల పాఠశాల ఎంతో క్రమ శిక్షణతో ఉందని రాసినట్లు చెప్పారు. 1998, జనవరి, నాలు గున పాఠశాలలో లూయి బ్రెయిలీ విగ్రహాన్ని హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ చలవేశ్వరయ్య చేతూలు మీదుగా ప్రతిష్టించారని పేర్కొన్నారు. 2007, డిసెంబరు, 20వ తేదీ జిల్లాలో నిర్వహి ంచిన ద్వశతాబ్ది ఉత్సవాలకు విచ్చేసిన రాష్ట్ర గవర్నరు తివారి అదనపు గదుల నిర్మాణానికి, డైనింగ్ హాలుకు శంకుస్థాపన చేశారని తెలిపారు. ప్రస్తుతం వందశాతం ఫలితాలు సాధి స్తున్నట్లు చెప్పారు. పాఠశాలలో ప్రస్తుతం పది ఉపాధ్యా యులు ఇరువు విద్యావాలంటీర్లు ఉన్నారని పేర్కొన్నారు.




కడప నగరంలో అంధుల పాఠశాల

అంధుల దైవం లూయి బ్రెయిలీ



అంధుల ఆరాధ్య దైవం లూయి బ్రెయిలీ ఆయన చూపిన మార్గంలో అంధులు పయనిస్తున్నారు. బ్రెయిలీ జయంతిని మేము పండు గలా చేసుకుంటున్నాం. అటెండర్ దగ్గర నుంచి ఐఎఎస్ (అంధులు) వరకు భాసిస్తున్నామంటే అది లూయి పెట్టిన బిక్షే. జయంతి గొప్ప పండుగ. **-కె.సాంబశివుడు, ప్రధాన కార్యదర్శి, ఎపి రాష్ట్ర రాయల అంధుల సంఘం.**

సానుభూతి కాదు.. చేయూత కావాలి



అంధులమని సానుభూతి చూపించడం కంటే తమలోని ప్రతిభను గుర్తించి చేయూతనివ్వాలి. అన్నిరంగాల్లో అంధులు ముందుకు పోవాలంటే ప్రభుత్వ ప్రోత్సాహకం అవసరం. సమస్యలను పరిష్కరించి విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలి.

-విసిఇఒ ప్రధాన కార్యదర్శి వి.సుబ్బరాయుడు.

వివక్ష చూపొద్దు



అంధులమని కొంతమంది అధి కారులు వివక్ష చూపడం తగదు. శక్తి వంచనలేకుండా కష్టపడుతున్నాం. అధికారులు బ్రెయిలీ జయంతి వేడుకల రోజు వచ్చి పోవడం కంటే తమకు ఎల్లవేళలా అందు బాటులో ఉండి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి. **-కొండయ్య, అధ్యక్షులు ఎపి రాష్ట్ర రాయల అంధుల సంఘం.**

మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం..



అంధుల పాఠశాలలో విద్యార్థులకు అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించాం. అమ్మాయిలకు, అబ్బాయిలకు విడివిడిగా హాస్టల్ సౌకర్యం ఉంది. ప్రస్తుతం 55 మంది విద్యార్థులు, 18 మంది ఉపాధ్యా యులున్నారు. విద్యా ర్థులకు అభివృద్ధికి కృషి చేస్తున్నాం.


-హెచ్ఎం, అంధుల పాఠశాల, కడప.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయండి



అంధులకు సంబంధించిన బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయండి. విద్య పూర్తి చేసినా ఉపాధి రాకపోవడంతో అంధులు చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వ ఉద్యోగం వస్తే ఆదరించేవారు ఉంటారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

-సి.ప్రకాష్, ఉపాధ్యక్షులు, ఎపి రాష్ట్ర రాయల అంధుల సంఘం.




బాలింతలకు బేబీ కిట్‌ను అందజేస్తున్న ముఖ్యమంత్రి

సిఎం పర్యటన దృశ్యమాలిక


సిఎంను కలిసిన హిజ్రాలు

ప్రజాశక్తి
www.prajasakti.com
కడప
గురువారం 4
జనవరి 2018

ఆ.. ఉపాధ్యాయుడు రైతులకే ఆదర్శం

ఆయనో ఉపాధ్యాయుడు. విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. వారిని మంచి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఎంతో శ్రమిస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తి అనేది అన్నింటిలోకెల్లా గొప్పది. ఉపరాష్ట్రపతి, ప్రధాని, సిఎం, కలెక్టర్, ఇంజనీర్లు, డాక్టర్లు.. ఇలా ఎవరైనా గురువు దగ్గర ఓనమాలు నేర్చుకుని ఉన్నత స్థానానికి చేరిన వారే. అంతటి ప్రాముఖ్యత ఉపాధ్యాయులకు ఉంది. మండలంలోని ఓ ఉపాధ్యాయుడు అందరిలా పాఠాలు చెబుతూ తన వృత్తికి న్యాయం చేస్తూనే ప్రవృత్తిగా వ్యవసాయాన్ని ఎంచుకున్నారు. అందులోనూ గణనీయమైన ఫలితాలు సాధిస్తూ అందరికీ ఆదర్శప్రాయుడిగా నిలుస్తున్నారు ఆయనే శివశంకర్‌రెడ్డి. ఆ వివరాలు తెలుసుకుందాం...

కోహినూరు విత్తనంతో దోస పంట
రూ. 7 లక్షలతో 8 ఎకరాలలో సాగు
తక్కువ ఆదాయంతో.. అధిక దిగుబడి

ప్రజాశక్తి - లక్కిరెడ్డిపల్లె

మండలంలోని గుడ్లవారిపల్లెకు చెందిన నందలూరు శివశంకర్‌రెడ్డి కాకుళారం పంచాయతీలో ఉపాధ్యాయుడిగా పని చేస్తునారు. పాఠశాలకు వెళ్లి సాయంత్రం 4 గంటలకు తిరిగి వస్తారు. అప్పటి నుంచి పొలంబాట పడతారు. కష్టపడి పని చేస్తేనే భవిష్యత్తు బాగుంటుందని ఆయన నమ్మిన సిద్ధాంతం. అయితే దేశానికి వెన్నెముక రైతు అని చెప్పుకొంటుంటున్నారు. అలాంటి నేల తల్లిని నమ్ముకొని ఆయన ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉపాధ్యాయ యూనియన్‌లో సంఘ నాయకునిగా ఉంటూ తన వృత్తికి న్యాయం చేస్తూ పంట పొలాల వైపు దృష్టి పెట్టి తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం సాధించేందుకు కృషి చేస్తున్నారు. ప్రత్యామ్నాయంగా దోస పంట వైపు ఆయన దృష్టి మళ్లింది.

కోహినూరు రకం దోస విత్తనం..

పూణే నుంచి కోహినూరు రకానికి చెందిన దోస విత్తనాలను కోసం రెండు కిలోలు తెప్పించారు. కిలో రూ. 64వేలతో మూడున్న కిలోల విత్తనాలు కొనుగోలు చేశారు. కిలో విత్తనాలు మూడున్నర ఎకరా చొప్పున తనకున్న 7 ఎకరాలలో మొత్తం దోసపంట వేశారు. సుమారు రూ. 7 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. ఎకరాకు 12 నుంచి 15 టన్నులు మంచి దిగుబడి వస్తుందని విత్తన కంపెనీ వారు చెప్పారని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను దోస ధర రూ. 20 నుండి 25వేలు పలుకుతోందని పేర్కొన్నారు. ఈరకం పంటను లక్కిరెడ్డిపల్లె ప్రాంతంలో ఇదివరకు ఎవరూ సాగు చేయలేదని, మొదటి సారి బంధువుల సలహా మేరకు పంట పెట్టానని తెలిపారు. ఇంక నెల రోజుల్లో పూర్తి పంట చేతికి వస్తుందని, అన్ని రకాల ఎరువులు, మందులు వాడుతున్నానని, మంచి దిగుబడులు వస్తుందని ఆయన ఆశిస్తున్నారు. ఇతర రైతులు ఆయన సాగు చేసిన పంటను చూసి తామూ భవిష్యత్‌లో కోహినూరు రకానికి చెందిన దోసను వేస్తామని పేర్కొంటున్నారు.


శివశంకర్‌రెడ్డి పొలంలో సాగవుతున్న కొత్తరకం దోస పంట


విద్యార్థులకు పాఠాలు చెబుతూ..


పొలంలో వ్యవసాయ పనులు చేస్తూ..

సేంద్రియ పద్ధతులోనే..

ప్రస్తుతం పంటలలో రసాయనిక వాడకం పూర్తిగా తగ్గించి సేంద్రియ ఎరువులు వాడకంపై దృష్టి సారించారు. ఇందు కోసం వర్మీకంపోస్టు ఎరువులు వాడుతున్నారు. ప్రభుత్వ రాయితీలూ వర్తిస్తున్నాయని చెబుతున్నారు. సేంద్రియ ఎరువులతో నష్టాలకు అడ్డుకట్ట వేయవచ్చని పేర్కొంటున్నారు. వేప. శీతాఫలం ఉడకపెట్టడం ద్వారా వచ్చే ద్రావణం చాలా ఉపయోగపడుతుందని తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తేగాక వ్యవసాయంలోనూ రాణించాలని ఎప్పటి నుంచో తన కల అని చెప్పారు. సమయం దొరికినప్పుడల్లా పంట సాగుపై దృష్టి సారిస్తానని తెలిపారు.


ముందు పాఠశాల.. తర్వాతే పొలం..



ముందు తన వృత్తి ధర్మానికి న్యాయం చేస్తాను. ఆ తరువాత సమయం దొరికినప్పుడు పంట పొలంలో ఉంటా. ప్రస్తుతం వేరుశెనగ, కంది పంట సరిగా రాకపోవడంతో మేలు రకమైన కోహినూరు దోస విత్తనాలు తెప్పించి పంట వేశాను. వ్యవసాయంలోనూ రాణించి ఇతర రైతన్నలకు ఆదర్శంగా నిలుస్తా.

-నందలూరు శివశంకర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు.

ఆస్తుల క్రయవిక్రయాలకు 'పాన్' తప్పనిసరి..!



ప్రజాశక్తి-చాపాడు

ఆస్తులను కొనుగోలు చేస్తున్న వారిపై ఆదాయ పన్నుశాఖ నిఘా పెడుతోంది. రూ.5 లక్షల వరకు ఆస్తి కొనుగోలు చేసినా ఇప్పటి దాకా పాన్‌కార్డు అవసరం లేకుండా ఉండేది. అయితే ఇప్పుడు లక్షల రూపాయలకు మించి కొనుగోలు చేసే వ్యక్తుల పాన్‌కార్డు నంబర్ తప్పనిసరిగా వేయాలి. ఈ మేరకు స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు ఉత్తర్వులు అయ్యాయి.

పాన్‌కార్డు లేకపోతే...

పాన్ కార్డు లేని పక్షంలో వ్యవసాయేతర వర్గాలకు ఫారం-60, వ్యవసాయదారులకు ఫారం-61 తీసుకుని జత చేసి రిజిస్ట్రేషన్లు చేస్తారు. ఈ రిజిస్ట్రేషన్లకు పాన్‌కార్డు తప్పనిసరి చేయడంతో వారిపై ఐటి శాఖ నిఘా ఉంటుంది. దీంతో క్రయ, విక్రయదారులు ఆస్తులు కొనాలన్నా, అమ్మాలన్నా వెనకడుగు వేస్తున్నారు. ఈ కారణంగా కొన్ని రోజుల నుంచి రిజిస్ట్రేషన్లు మందకొడిగా సాగుతున్నాయి. దీంతో ఆ శాఖ ఆదాయానికి గండి పడుతోంది.

పెద్దనోట్ల రద్దు నుంచి..

పెద్ద నోట్ల రద్దు నుంచి రిజిస్ట్రేషన్లకు బ్యాంకులో చలానా కట్టాలంటే పాన్‌కార్డు తప్పనిసరిగా చేసింది. కానీ ఇవేవి పెద్ద అడ్డంకులు కాకపోవడంతో క్రయ, విక్రయాలు సాఫీగా కొనసాగాయి. స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్లశాఖ కొనుగోలు, అమ్మకం దారులిద్దరికి సంబంధించి ఆధార్ నంబర్లతోపాటు వారి పాన్‌కార్డులను అనుసంధానం చేయాలన్న నింధన పెట్టింది. పాన్‌కార్డు కల్గి ఆధార్‌తో అనుసంధానం లేకపోయినా విక్రయ దస్తావేజు (సేల్‌డీల్)ను రిజిస్ట్రేషన్ చేయడం కుదరదని అధికారులు నిలిపేస్తున్నారు.

నంబర్ తప్పగా ఇస్తే..

ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ శాఖలో ఆన్‌లైన్ ఆధార్ నంబర్‌కు అనుసంధానం చేసి, ఆధార్ ఓపెన్ అయితేనే క్రయ, విక్రయదారులకు రిజిస్ట్రేషన్ అవకాశముంది. పాన్‌కార్డును కూడా రిజిస్ట్రేషన్‌శాఖ ఆన్‌లైన్ చేసింది. ఎవరైనా తప్పుడు పాన్ నంబర్ ఇస్తే పరిశీలించి కరెక్టు కాకపోతే తిరస్కరిస్తారు. రిజిస్ట్రేషన్ శాఖలో పాన్‌కార్డు కరెక్టా? కాదా? తెలియడానికి నేషనల్ సెక్యూరిటీ డిపాజిట్రీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేస్తారు. దీని ద్వారా పాన్‌కార్డును పరిశీలించి రిజిస్ట్రేషన్ చేస్తారు.

రూ. 30 లక్షల ఆస్తి కొంటే..

రూ.30 లక్షల ఆస్తి కొనుగోలు, అమ్మకం చేస్తే ఆ డాక్యుమెంట్స్‌ను ఐటిశాఖకు పంపించాలని ఇటీవల స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ సబ్ రిజిస్ట్రార్లకు సమాచారం చేరవేస్తోంది. ప్లాట్ల అమ్మకం, కొనుగోలుదారులు రిజిస్ట్రేషన్‌కు పాన్‌కార్డు అనుసంధానంపై ఆందోళన వ్యక్తం చేశారు. చాలా మంది ఇప్పటికే ప్రభుత్వానికి ఆదాయ పన్నులు చెల్లించడం లేదు.

క్రయవిక్రయదారుల్లో ఆందోళన..

క్రయవిక్రయాల సమయంలో ఆస్తుల విలువ రూ.కోట్లలో ఉండడంతో పాన్‌కార్డు లింకు పెడితే ఐటి అధికారుల దృష్టికి వెళ్లే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు. దీంతో ఆదాయ పన్ను చెల్లించలేని వారు ఆస్తులు అమ్మకాలు, కొనుగోలు చేయాలంటే భయపడుతున్నారు. పాన్‌కార్డు లింక్‌తో ఆదాయపన్ను చెల్లించాల్సి వస్తుందోమోనని సంకోచిస్తున్నారు. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు రిజిస్ట్రేషన్ల జోలికి వెళ్లేందుకు జంకుతున్నారు. ఆ శాఖ తాజా ఆదేశాలు అన్ని వార్గల వారికి ఆందోళన కల్గిస్తోంది.



పెడబల్లివాండ్లపల్లెలో సమస్యలు తిష్ట

రాజకీయ నాయకులు ఎన్నికల వేళ వాగ్దానాలు చేస్తారు. ఎన్నికల అనంతరం అటువైపు చూడరు. సర్పంచ్ స్థాయి నుండి ఎమ్మెల్యే, ఎంపీ స్థాయి వరకు ఇదే తంతు. దశాబ్దాలు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోలేదు ఆ గ్రామం. ఇప్పటికీ దిగుడుబావి నీరే శరణ్యం వారికి. దళితవాడలో చేతి పంపు ఉన్నా క్లోరైడ్ నీటితో అనారోగ్యం పాలవుతున్నారు. రోళ్ళ మడుగు నీరు ఇస్తామని కాంట్రాక్టర్లు వేసిన పైపులైన్ పిచ్చి మొక్కలలో కలిసిపోయి అధికారుల, రాజకీయ నాయకుల పని తీరును ప్రశ్నిస్తోంది. దళితల కోసం ఎస్సీ సబ్ ప్లాన్‌కు ఆ దళితులు ఆమడ దూరంలో ఉన్నారు. దళితులు, రజకులు, అగ్రవర్ణాలు 70 కుటుంబాలున్న పెడబల్లివాండ్లపల్లె వాసుల పరిస్థితి దారుణంగా ఉంది.


కంప చెట్లతో నిండిపోయిన కాలిబాట

- దిగుడుబావి నీరే గతి
- ఫ్లోరైడ్ నీటితో ఆరోగ్య సమస్యలు
- పిచ్చిమొక్కల మధ్యలో ఎక్కిరిస్తున్న రోళ్ళమడుగు పైపులైన్
- రోడ్డు లేక గ్రామస్తుల ఇక్కట్లు
- ఎస్సీ సబ్ ప్లాన్‌కు నోచని దళితవాడ

ప్రజాశక్తి - రామాపురం

రామాపురం, వీరబల్లి మండలాలకు సరిహద్దులో ఆ గ్రామం ఉంది. అక్కడికి అధికారులు వెళ్లడం అరుదు. గ్రామంలోకి ఆటోలు వెళ్లాలన్నా గగనమే. ఊరిలో మట్టి రోడ్డు, సిమెంట్ రోడ్డుకు నోచుకోలేదు. ముళ్ళ కంపలు, పిచ్చి మొక్కలతో నిండి కాలిబాట మూసుకపోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో ఎప్పుడో వేసిన చేతి పంపు కావడంతో ఫ్లోరైడ్ నీటిని తాగి అనారోగ్యం పాలు కావాల్సి వస్తుందన్నారు. డ్రైనేజీ వ్యవస్థ ఊసేలేదు. కనీసం మట్టి రోడ్డుకు కూడా నోచుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రోళ్ళమడుగు నీరు ఇస్తామని పైపులైన్ వేశారు ఇంత వరకు నీరు రాలేదు. చుట్టుపక్కల గ్రామాలకు నీరు సరఫరా అవుతోంది. దళితులు 40 కుటుంబాలు ఉన్నా ఎస్సీ సబ్‌ప్లాన్‌కు నోచుకోలేదు. గ్రామంలో చిన్న పిల్లలున్నా పక్క గ్రామానికి వెళ్లాల్సి వస్తోందన్నారు. జన్మభూమి, రచ్చబండ, జన్మభూమి మా ఊరు పేర్లు ఎన్ని చేస్తున్నా, అధికారుల, ప్రజాప్రతినిధులు ఆర్భాటాలు తప్ప గ్రామానికి వచ్చిన పాపాన పోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సరైన రోడ్డు లేదు



మా మాలపల్లెలో తాగడానికి నీరు లేదు. సరైన రోడ్డు లేదు. ఊరు చుట్టు కంప చెట్లతో మూసుకపోయింది. ఆటోలు వచ్చేందుకు భయపడతారు. ఆటో దిగి అర్ధ కిలోమీటరు నడచాల్సిందే.

-పి.శివారెడ్డి, పెడబల్లివాండ్లపల్లె


కాళ్ళనొప్పులు వస్తున్నాయి



మా గ్రామంలో ఉండే బోరు నీరు తాగి కాళ్ళ నొప్పులు వచ్చాయి. డాక్టర్లు మాత్రం ఫ్లోరైడ్ నీరు తాగడం వల్లే ఇలా అయిందని చెబుతున్నారు. మా ఊళ్ళో ఉండేది ఆ ఒక్క బోరే.

- హసనాపురం రమణమ్మ, పెడబల్లివాండ్లపల్లె


దిగుడుబావి నీరు


పిచ్చి మొక్కల మధ్యలో రోళ్ళమడుగు పైపులైన్

నల్లబ్యాడ్జీలతో నిరసన

ప్రజాశక్తి - రాయచోటిటౌన్

సమస్యల పరిష్కారం కోరుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి డివిజన్ కార్యాలయం నందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. కాంట్రాక్టు కార్మికులందరినీ సంస్థలో విలీనం చేసి నేరుగా జీతాలు చెల్లించాలని తెలిపారు. దశల వారీగా క్రమబద్ధీకరించాలని, మరణించిన కుటుంబాలకు రూ. 20 లక్షలు ఎక్స్‌గ్రేసియా ఇచ్చి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. కో-ఆప్షన్ సభ్యులు సుబ్రమణ్యంరాజు మాట్లాడుతూ కార్మికుల డిమాండ్‌లను నెరవేర్చాలని, లేని పక్షంలో 27 నుంచి నిరవధిక సమ్మెలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ ప్రెసిడెంట్ రెడ్డి నాగభూషణం, జిల్లా వైస్ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, రవి, వీరూ, నాయకులు రెడ్డెప్ప, శ్రీనివాసులనాయుడు పాల్గొన్నారు.


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కార్మికులు

పేదల సంక్షేమమే జన్మభూమి ధ్యేయం

ప్రజాశక్తి - రామాపురం

పేదల సంక్షేమమే జన్మభూమి ధ్యేయమని లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.రమేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని బండపల్లె పంచాయతీలో బుధవారం సర్పంచ్ వెంకటరమణ అధ్యక్షతన జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ దేవేళానాయక్, ఎంపిడిఒ అబ్దుల్ రహీం, ఎంఇఒ రామకృష్ణుడు, వైద్యాధికారి చంద్రశేఖర్, ఇఒపిఆర్‌డి శ్రీనివాసులరెడ్డి, ఎపిఒ పెంచలయ్య, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ గుర్రమ్మ, ఎఇలు సుధాకర్, ప్రసాద్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షులు వై.శేఖర్, ఎంఎల్ వెంకటరామిరెడ్డి, రంగారెడ్డి, బసిరెడ్డి పాల్గొన్నారు.

వీరబల్లిలో..

రాష్ట్ర అభివృద్ధే ముఖ్యమంత్రి ఆశయమని మండల ఎంపిపి చౌడవు స్వప్న అన్నారు. బుధవారం సోమవరం గ్రామ పంచాయతీ పుత్తవాండ్లపల్లె పంచాయతీ కార్యాలయంలో జన్మభూమి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. అర్హులైన వారు ఇంకా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పింఛన్లు, రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మురళీధర్‌రెడ్డి, ఎంపిడిఒ జనార్దన్‌రావు, తహశీల్దార్ నారాయణరెడ్డి, సర్పంచ్ రాజమ్మ, మండల స్థాయి అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో...

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు జన్మభూమి మా ఊరు కార్యక్రమమని రాయచోటి నియోజకవర్గ నోడల్ అధికారి విజయచంద్ర అన్నారు. బుధవారం మండలంలోని కుర్నూతల గ్రామంలో జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. పింఛన్లు, రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎపిడి శివప్రసాద్, ఎంపిడిఒ రవికుమార్‌రెడ్డి, తహశీల్దార్ వెంకటరమణ, ఎంఇఒ చక్రేనాయక్, అధికారులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పోరాటాలు మరువలేనివి

ప్రజాశక్తి-పులివెందుల

సమాజంలో మహిళల అభ్యున్నతి కోసం సావిత్రి బాయిపూలే చేసిన పోరాటాలు మరువలేనివని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చిన్న నరసింహులు పేర్కొన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని విద్యార్థినులకు వ్యాస రచన పోటీలు బుధవారం ఏర్పాటు చేశారు. పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నరసింహులు మాట్లాడుతూ మహిళలు విద్యావంతులను చేయడంలో సావిత్రిబాయి ప్రధాన పాత్ర పోషించారన్నారు. ప్రతి మహిళ చదువుకుని శిఖరాగ్రాలకు చేరుకోవాలని కోరారన్నారు. మహిళాభ్యుదయం కోసం ఆమె చేసిన సంఘసేవ, సంఘ సంస్కరణలు ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారన్నారు. సమాజానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిఐటియు డివిజన్ కార్యదర్శి ఎస్ఎ గఫూర్ పాల్గొన్నారు.


బహుమతులను అందజేస్తున్న గఫూర్

చంద్రన్న కానుక పంపిణీ

ప్రజాశక్తి - రామాపురం

మండలంలోని చిట్లూరు పంచాయతీ పక్కీర్‌పల్లెలో టిడిపి మండల అధ్యక్షులు వై.శేఖర్ చంద్రన్న కానుకను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబం సంతోషంగా పండుగను చేసుకోవాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం చంద్రన్న కానుకను పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణమ్మ, టిడిపి నాయకులు భాస్కర్, వెంకటరమణ, డీలర్ మాబు, పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో ఇంటర్నెట్ సౌకర్యం

ప్రజాశక్తి - వేంపల్లి

మండల కేంద్రమైన వేంపల్లి గ్రంథాలయాన్ని బుధవారం గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి సందర్శించారు. గ్రంథాలయంలోని పుస్తకాలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో జిల్లాలోని కడప సెంట్రల్ లైబ్రరీలను, జమ్మలమడుగు, రాజంపేట గ్రంథాలయాల్లో మొదటి దఫాగా ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. నామమాత్ర ఫీజుగా గంటకు రూ. 5 తీసుకోంటున్నామన్నారు. ఇది విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ సుకూర్ పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న శ్రీనివాసులరెడ్డి

తహశీల్దార్‌ను చుట్టుముట్టిన సోలార్ బాధితులు


తహశీల్దార్‌ను చుట్టుముట్టిన సోలార్ బాధితులు

ప్రజాశక్తి - గాలివీడు

5వ విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో తమ సమస్యలు పరిష్కరించాలని సోలార్ బాధితులు తహశీల్దార్‌ను చుట్టు ముట్టారు. బుధవారం తూముకుంట గ్రామ సచివాలయం నందు సర్పంచ్ ఎస్. అనితమ్మ ఆధ్వర్యంలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో తహశీల్దార్ భవానీ మాట్లాడుతుండగా సోలార్ బాధితులు తమకు పరిహారం అందలేదని, న్యాయం చేయాలని మొరపెట్టుకొన్నారు. ప్రజలందరూ సోలార్ సమస్యతోనే వచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ సమస్యలపై అర్జీలు ఇవ్వాలని, వినతులను స్వీకరిస్తామని తెలపడంతో ముంపు బాధితులు వెనుతిరిగారు. తూముకుంట నుంచి 28, తలముడిపి నుంచి 17 దరఖాస్తులు అందినట్లు సీనియర్ అసిస్టెంట్ రాణాప్రతాప్‌రెడ్డి, ఎంపిడి వెంకటసుబ్బయ్యలు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్, ఐసిడిఎస్, జన్మభూమి కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి- జమ్మలమడుగు

పట్టణంలోని కన్నెలూరు పాఠశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, వంటల పోటీలు, వెల్‌బేబీ షో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 10వ తేదీ లోపు కన్నెలూరు ప్రాథమిక పాఠశాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పోటీలకు కన్నెలూరు గ్రామ ప్రజలు మాత్రమే అర్హులన్నారు. కమిటీ విధి విధానాలు, షరతులు పాటించాల్సి ఉంటుందని తెలిపారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - చెన్నూరు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని మండల ఉపాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం బాలసింగాయపల్లెలో జన్మభూమి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకుంటే ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చునన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పక్కాగృహాలు, పింఛన్లు, రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నా మన్నారు. కడప మార్కెట్‌యార్డు చైర్మన్ శివారెడ్డి మాట్లాడుతూ ప్రతి కుటుంబం మరుగుదొడ్డి నిర్మించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పెంచలయ్య, ఎంపిడిఓ మహబూబ్‌బీ, తహశీల్దార్ వైఎస్ సత్యానందం, సర్పంచ్ పద్మావతి, ఎంపిటిసి ఓబులమ్మ పాల్గొన్నారు.

దువ్వూరులో... మండలంలోని కృష్ణంపల్లె గ్రామంలో మంగళవారం జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎన్. రవిశంకర్ రెడ్డి, మండల అధికారులు, సర్పంచ్ లక్ష్మీదేవి మాట్లాడుతూ కార్యక్రమంలో మొత్తం అర్జీలు 33 వచ్చాయన్నారు. రేషన్‌కార్డులకు 16, వృద్ధాప్య పింఛన్‌కు 13, పక్కాగృహానికి 3, శ్మశానస్థలానికి ఒకటి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో భాగంగా మూడు కొత్త రేషన్‌కార్డులు, సంక్రాంతి తోఫాను పంపిణీ చేసినట్లు చెప్పారు.

సిఎం సభకు జనాల తరలింపు

ప్రజాశక్తి - నందలూరు

5వ విడత జన్మభూమి కార్యక్రమానికి కడప జిల్లా పులివెందులకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సభకు మండలం నుండి భారీగా జనం తరలివెళ్లారు. అధికారులు సైతం జనాలను సభకు తరలించారు. వెలుగు మహిళలు భారీగా తరలివెళ్లడం విశేషం.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి - మైదుకూరు

విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రం మొత్తం అంధకారంలోకి పోవాల్సి వస్తుందని కడప జిల్లా విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఐక్య కార్యాచరణ కమిటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. స్థానిక డివిజన్ ఇంజనీర్ కార్యాలయం ముందు బుధవారం జాక్టో పిలుపులో భాగంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. పక్క రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించడం, వేతనాలను పెంచిందని తెలిపారు. ఇక్కడి ప్రభుత్వం, యాజమాన్యం ఆ విధమైన చర్యలు చేపడితే కార్మికులకు, యాజమాన్యానికి ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అలా లేనిపక్షంలో దళారీలకు వేల కోట్ల రూపాయలు అప్పనంగా చెల్లించాల్సి వస్తుందనీ, ఈ విధానానికి ఇప్పటికైనా స్వస్తి చెప్పి మా సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని అన్నారు. యాజమాన్యం కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ప్రభుత్వం గతంలోనే తీర్పు ఇచ్చిందని చెప్పారు. కాంట్రాక్ట్ కార్మికులతో పని చేయించకూడదని నిబంధన ఉన్నప్పటికీ యాజమాన్యం మొండిగా కాంట్రాక్ట్ కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తూ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 27 నుంచి సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి కార్మికుడు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సురేష్ సుజన్, ఈశ్వరయ్య, కొండారెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు ఆదర్శం సావిత్రిబాయి పూలే



సావిత్రిబాయిపూలే చిత్రం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు



మైదుకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - చాపాడు

భారతదేశపు తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే మహిళలకు ఆదర్శమని లక్ష్మిపేట జడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం నరహరిశర్మ పేర్కొన్నారు. బుధవారం పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు గడప దాటని రోజుల్లో సావిత్రి బాయి బాలికల విద్యకోసం ఉద్యమించిన గొప్ప వ్యక్తి అన్నారు. జెవివి మహిళ నాయకులు జవహర్ మున్నీర్ మాట్లాడుతూ 1848లో ఆనాటి నియమాలను ఉల్లంఘించి వివిధ కులాలకు చెందిన ఎనిమిది మంది బాలికలతో పాఠశాలను స్థాపించా రన్నారు. మహిళలను విద్యావంతులుగా మార్చేందుకు ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులరెడ్డి, ఎన్ భారతి, విజయ, తులసిరెడ్డి, లక్ష్మి, సంధ్యారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

మైదుకూరులో... సావిత్రిబాయి పూలే జన్మదిన వేడుకలను పట్టణంలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలోని పది అడుగుల సావిత్రి బాయిపూలే చిత్రపటానికి మండల విద్యాశాఖ అధికారి టి.ఎం. పద్మలత. హెడ్‌మాస్టర్లు వెంకటలక్షుమ్మ, మీనాక్షికుమారి, పూలమాలల వేసి నివాలి అర్పించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. రాయల్ సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి ఆడపిల్ల చదువు-అవనికి వెలుగు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ పద్మలత మాట్లాడుతూ భారతదేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయ రాలు సావిత్రి భాయిపూలే అని తెలిపారు. స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేశారన్నారు. బాలిక పాఠశాలను, వితంతు పాఠశాలను నెలకొల్పి 18 ఏళ్ల వయస్సులోనే ఉపాధ్యాయురాలిగా పిల్లలకు విద్యను బోధించారని చెప్పారు. దళితులు, అల్పసంఖ్యాక వర్గాల ప్రజలు విద్యకు దూరంగా ఉన్న కాలంలో విద్యను అందరికీ అందుబాటులోకి తెచ్చిన గొప్ప విప్లవ మాతృమూర్తి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ సావిత్రిబాయిపూలే కలలు నేరవేరాలంటే నేటియువత విద్యార్థులు ఆమె జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల నాయకులు రాయప్ప, సర్దార్ ఫైజి, రాజు, అబ్దుల్‌కలాం, ఎస్‌ఎఫ్ఐ నాయకులు నరసింహ, శేఖర్, మహిళ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు సుబ్రమ్మ, రెడ్డికుమారి, విజయలక్ష్మి, విజయేశ్వరి, అన్నపూర్ణమ్మ, ఓబులేసు పాల్గొన్నారు.

జన్మభూమి సభలకు ఆదరణ కరువు



ప్రజలు లేక సిఎం ఉపన్యాసం వింటున్న అధికారులు

ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జన్మభూమి మాఊరు గ్రామసభలకు ప్రజల నుంచి ఆదరణకరువు అవుతున్నది. గ్రామ సభలు ఉదయం 9నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నారు. అయితే మధ్యాహ్నం వరకు మాత్రమే ప్రజలు కనిపిస్తున్నారు. మధ్యాహ్నం 2గంటలకు సిఎం టివి ప్రసంగానికి కేవలం అధికారులు మాత్రమే దిక్కుగా మారుతున్నారు. గ్రామసభలలో ఫిర్యాదులు చేసినప్పటికీ ఏమాత్రం ఉపయోగం లేకపోవడం అర్హులైన వారికి పింఛన్లు, రేషన్‌కార్డులు, గృహాలను మంజూరు చేసే అధికారం మండల అధికారులకు ఉండడం లేదని ప్రజలు వాపోతున్నారు. టిడిపి నాయకులు సూచించిన వారికే పథకాలు సమకూరుతున్నాయని అలాంటప్పుడు సభలకు వెళ్లడం ఎందుకని వాపోతున్నారు. అధికారుల ప్రసంగాలకే సభలు పరిమితం అవుతున్నాయన్న విమర్శలు విన పడుతున్నాయి. బుధవారం మండల పరిధిలోని భద్రిపల్లె గ్రామంలో తహశీల్దార్ పుల్లారెడ్డి, లక్ష్మీపేట ఎంపిడిఒ రామదాసు ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్‌లు పార్వతి, సుమలత, ఎంపిటిసిలు జ్ఞానమ్మ మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు జన్మభూమికి మంత్రి 'ఆది' రాక



మాట్లాడుతున్న ఆసం రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జన్మభూమి ఐదవ విడతలో భాగంగా గురువారం మార్కెటింగ్ శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి ప్రొద్దుటూరుకు రానున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 11వార్డుకు చెందిన కాన్నుల ఆసుపత్రిలో నిర్వహించనున్న జన్మభూమి కార్యక్రమానికి మంత్రి హాజరవుతారన్నారు. గతంలో మంజూరై పంపిణీకి నోచుకోని 77మందితో పాటు కొత్తగా మంజూరైన 149 మంది చేనేత కార్మికు లకు పెన్షన్లు మంజూరు చేస్తామన్నారు. కాపు కార్పొరేషన్ ద్వారా 40 కుట్టుమిషన్లు పంపిణీ చేస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టుమిషన్లు తీసుకునేందుకు అర్హులు అన్నారు. కార్యక్రమానికి ప్రజలు, అధికారులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.



ఛాయాగ్రహ ప్రదర్శనలో అధికారులు

జెవివి ఆధ్వర్యంలో ఛాయాగ్రహ ప్రదర్శన

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని లక్ష్మిపేట గ్రామంలో బుధవారం నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో జెవివి జిల్లా సైన్స్ ఎగ్జిబిషన్ కన్వీనర్ ఆర్ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సలహాలు, సూచనలు తెలియజేసే ఛాయాచిత్ర ప్రదర్శనను నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యంపై అవగాహన లేకపోతే అనేక సమస్యలు తలెత్తుతాయన్నారు. జీవనశైలిలో వచ్చిన మార్పులలో ఎక్కువగా గ్రామాలలో డయాబెటిస్, గుండె సంబంధిత వ్యాధులు, బిపి, క్యాన్సర్ అధికంగా వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఎంపిడిఓ రామదాసు, ఎంఇఓ సుబ్బరాయుడు, ప్రధానోపాధ్యాయులు, నరహరిశర్మ, సర్పంచ్‌సుమలత, ఉపాధ్యాయులు, రమణమ్మ, రాజశేఖర్‌రెడ్డి, ఇజ్రాయల్, ప్రజలు పాల్గొన్నారు.

రైతు సంఘం క్యాలెండర్ విడుదల

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

బిమఠం మండలంలోనిఆంధ్రప్రదేశ్ రైతు కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం 2018 నూతన క్యాలెండరును వ్యవసాయ ఎఓ మల్లికార్జునరెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, నాయుడు, గజ్జల నాగిరెడ్డి, దస్తగిరి ఆవిష్కరించారు.. అనంతరం ఎఓ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రైతులు పంట సాగు చేసుకునేటప్పుడు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి ఏ సీజన్‌లో ఏ పంటలు వేయాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలపై తగిన సూచనలు, సలహాలు తీసుకోవాలని చెప్పారు. ఈ విధంగా చేస్తే రైతులు మంచి దిగుబడి సాధించి లాభాలు పొందవచ్చన్నారు. అనంతరం మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ మండలంలోని పైరుకు సంబంధించిన విత్తనాలు తక్కువగా రావడం వల్ల అందరూ లబ్ధి పొందలేకపోతున్నారని తెలిపారు. రైతులకు బ్యాంకు రుణాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

విద్యపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

విద్యపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు అన్నారు. బుధవారం పట్టణంలోని కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎస్‌బిఐ కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చిన్న వయస్సు నుంచే విద్యపై మంచి పట్టు సాధించాలన్నారు. బాలికలను విద్యకు దూరంగా ఉంచరాదన్నారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబులెన్స్ ఫోన్ నంబర్లు

ప్రయివేటు అంబులెన్స్ డ్రైవర్లు (కడప జిల్లా కేంద్రంలో ఉండే)

తరుణ్ అంబులెన్స్	98493 88943
డా॥ విద్యాసాగర్ హాస్పిటల్ అంబులెన్స్	96181 77681
విష్ణు అంబులెన్స్	99129 09035



కడప నగరంలోని హాస్పిటల్స్

తిరుమల హాస్పిటల్, 7 రోడ్లు	08562 – 222140
భారతి హాస్పిటల్, ఎర్రముక్కపల్లి	08562 – 257089
శ్రీ హాస్పిటల్, ద్వారకానగర్	08562 – 257499
ఉషారాణి హాస్పిటల్, ద్వారకానగర్	08562 – 245098
అరవింద్ కంటి ఆస్పత్రి, ఆర్.కె.నగర్	08562 – 246890
కొమ్మా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి	91000 13357
శ్రీమోహన్ హాస్పిటల్, ఆర్‌టిసి బస్టాండ్	08562 – 246171
సూర్య హాస్పిటల్, మారుతీనగర్	08562 – 251999
తులశమ్మ హాస్పిటల్, నాగరాజుపేట	08562 – 241550
అశ్వని చిన్నపిల్లల హాస్పిటల్, ద్వారకానగర్	98850 16122

నగరపాలక సంస్థ, నగర పంచాయతీ కమిషనర్లు

కడప	శివారెడ్డి (జెసి–2)	98499 05862
ప్రొద్దుటూరు	శేషన్న	98499 05863
ఎర్రగుంట్ల	విజయసింహారెడ్డి	90001 03129
పులివెందుల	మధుసూధన్‌రెడ్డి	98665 56180
మైదుకూరు	కృష్ణారెడ్డి	80085 59302
బద్వేలు	శివరామిరెడ్డి	99595 55838
జమ్మలమడుగు	లక్ష్మీరాజ్యం	98499 01670
రాయచోటి	ప్రసాదరాజు	99492 45670
రాజంపేట	ఎం.వి. రమణారెడ్డి	99890 51971

కూరగాయల ధరలు

రకాలు	కిలో(రూ)
మటిక	20
టమోటా	09
బీన్స్	30
దొండకాయలు	26
క్యారెట్	66
కాలీఫ్లవర్ (ఒకటి)	32
కాకరకాయలు	20
పచ్చిమిర్చి	20
వంకాయలు	16
బెండకాయలు	20
బంగాళదుంపలు	18
చిక్కుడు	20
బీట్రూట్	30
అల్లం (పాతది)	48
అల్లం (కొత్తది)	48
ముల్లంగి	18
బీరకాయలు	20
అలసంద	24
మునగకాయలు (నాలుగు)	10
నిమ్మకాయలు (డజను)	10
కరివేపాకు (కట్ట)	01
కొత్తిమీర (కట్ట)	05
పొదీనా (కట్ట)	06

జిల్లాలో గ్యాస్ ఏజెన్సీల ఫోన్ నెంబర్లు

ఇండేన్ గ్యాస్ ఏజెన్సీల ఫోన్ నెంబర్లు

ఖాజా గ్యాస్ ఏజెన్సీస్, కడప	08562 – 253071
ఆటమ్ గ్యాస్ ఏజెన్సీస్, కడప	08562 – 274262
గణేష్ గ్యాస్ ఏజెన్సీస్, కడప	08562 – 277501
బాలాజీ గ్యాస్ ఏజెన్సీస్, ప్రొద్దుటూరు	08564 – 253071
ఈశ్వర్ గ్యాస్ ఏజెన్సీస్, ప్రొద్దుటూరు	08564 – 245112
శ్రీ వినాయక గ్యాజ్ ఏజెన్సీస్, రాయచోటి	08561 – 255061
రిషికా గ్యాస్ ఏజెన్సీస్, రైల్వేకోడూరు	08566 – 243419
అమ్మవారి గ్యాస్ ఏజెన్సీస్, ప్రొద్దుటూరు	08564 – 251560
బాషా గ్యాస్ ఏజెన్సీస్, పోరుమామిళ్ల	08569 – 285530

హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీల ఫోన్ నెంబర్లు

ప్రసాద్‌గ్యాస్ ఏజెన్సీ, కడప	08562 – 254721
గరిశా గ్యాస్‌ఏజెన్సీ, కడప	08562 – 241049
శ్రీ సాయి గ్యాస్ ఏజెన్సీ, రాజంపేట	08565 – 249600
అనిల్‌గ్యాస్ ఏజెన్సీ, ప్రొద్దుటూరు	08564 – 253006
సిద్ధి వినాయక గ్యాజ్ ఏజెన్సీ, బద్వేల్	08569 – 282233
మురుగన్ గ్యాజ్‌సర్వీస్, పుల్లంపేట	08565 – 247722
సిఒఆర్ గ్యాస్ ఏజెన్సీ, గాలివీడు	08567 – 233822
శ్రీసాయిరజిత గ్యాస్ ఏజెన్సీస్, వేంపల్లి	08555 – 280055

భారత్ గ్యాస్ ఏజెన్సీల ఫోన్ నెంబర్లు

శివశంకర్ గ్యాస్ ఏజెన్సీ, నందలూరు	08565 – 243777
చెన్నకేశవ గ్యాస్ ఏజెన్సీ, ఒబులవారిపల్లి	08566 – 201032
విజయలక్ష్మి గ్యాస్ ఏజెన్సీ, కమలాపురం	08563 – 274969
సుజాత గ్యాస్ ఏజెన్సీ, చెన్నూరు	08562 – 235982

కడప జిల్లాలోని వివిధ రైల్వేస్టేషన్‌ల ఫోన్ నెంబర్లు

రైల్వేస్టేషన్ పేరు	ఫోన్ నెంబర్
కడప 08562	– 242131
కమలాపురం 08563	– 274223
ఎర్రగుంట్ల 08563	– 275132 273127
ముద్దనూరు08560	– 278253
కొండాపురం 08560	– 274234
రాజంపేట 08655	– 240203
రైల్వేకోడూరు 08566	– 244023
నందలూరు 08565	– 243023
ఒంటిమిట్ట 08589	– 274181
పుల్లంపేట 08566	– 257112



ప్రొద్దుటూరు

		3న– ముగింపు	క్రితం
బంగారం (24 క్యా)	:	30,500	30,400
ఆర్నమెంట్	:	28,100	28,000
వెండి (కిలో)	:	40,500	40,200

నగరంలోని పోలీస్ స్టేషన్ల ఫోన్ నెంబర్లు

పోలీస్ కంట్రోల్ రూము	100	గ్రామీణ	9440796907
డీఎస్పీ	9440796904	టుటౌన్	9440796990
వన్‌టౌన్	9440796905	సీసీఎస్	9440796917
చిన్నచౌకు	9440796911	రిమ్స్	9440901823

చికెన్ ధర



చికెన్ స్కిన్‌లెస్ కిలో రూ. 180
చికెన్ విత్ స్కిన్ కిలో : 160



కోడిగుడ్లు డజను
రూ. 43/-

సినిమాలు

రవి : హలో, **సుధ** : అక్సిజన్, **ప్రతాప్** : 2 కంట్రీస్, **రమేష్** : ఎంసిఎ, **మురళి** : ఒక్కక్షణం, **అమీర్** : టైగర్ జిందా హై, **తాహర్** : సప్తగిరి ఎల్‌ఎల్‌బి, **రాజా (రహత్)** : ప్రొజెక్టు, **ఎస్‌ఆర్ (సాయిబాబా)**: ఎంసిఎ, **అప్సర** : రాజుగారిగది–2

రైళ్ల రాకపోకల వివరాలు

కడప రైల్వేస్టేషన్ మీదుగా ప్రతిరోజు 19 రైళ్లు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇవి కాక మరో 10రైళ్లు వారానికి ఒకటి, రెండు లేక మూడుసార్లు ఈ రైల్వేస్టేషన్ గుండా వెళ్తుంటాయి. మొత్తంగా 29రైళ్లు వేలాది మంది ప్రయాణీకులను వారి గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. కడప రైల్వేస్టేషన్ కాలనిర్ణయ పట్టిక ఇదే.

వ.సం	రైలు నెం.	ఏరోజు	నుంచి	వరకు	వచ్చే సమయం	వెళ్లే సమయం
1.	16352	సోమ, శుక్ర	నాగర్‌కోయిల్	ముంబై	00.34	00.35
2.	17652	ప్రతిరోజు	కాచిగూడ	చెన్నయ్,ఎగ్మోర్	00.49	00.50
3.	17420	ప్రతిరోజు	హైదరాబాద్	తిరుపతి	2.44	2.45
4.	16734	గురువారం	ఓఖా	రామేశ్వరం	3.23	3.25
5.	17416	ప్రతిరోజు	కొల్హాపూర్	తిరుపతి	4.20	4.25
6.	11028	ప్రతిరోజు	చెన్నయ్	ముంబై	4.34	4.35
7.	12797	ప్రతిరోజు	కాచిగూడ	చిత్తూరు	4.38	4.40
8.	16382	ప్రతిరోజు	కన్యాకుమారి	ముంబై	6.28	6.30
9.	16351	బుధధాది	ముంబాయి	నాగర్‌కోయిల్	7.18	7.20
10.	12707	సోమ/బుధ/శుక్ర	తిరుపతి	నిజాముద్దీన	7.58	8.00
11.	57274	ప్రతిరోజు	తిరుపతి	హుబ్లీ ప్యాసింజర్	9.13	9.15
12.	11044	ఆది	మధురై	లోకమాన్యతిలక	9.30	9.40
13.	11041	ప్రతిరోజు	ముంబై	చెన్నయ్	10.03	10.05
14	12164	ప్రతిరోజు	చెన్నయ్, ఎగ్మోర్	దాదార్	11.29	11.30
15.	16381	ప్రతిరోజు	ముంబై	కన్యాకుమారి	11.33	11.35
16.	16733	శని	రామేశ్వరం	ఓఖా	13.53	13.55
17	12163	ప్రతిరోజు	దాదార్	చెన్నయ్, ఎగ్మోర్	14.08	14.10
18	07606	మంగళ	కాచిగూడ	మంగళూరు	14.41	14.42
19	56012	ప్రతిరోజు	కడప	అరక్కోణం	13.45	14.35
20	07675	గురు	మంగళూరు	కాచిగూడ	15.22	15.23
21	11042	ప్రతిరోజు	చెన్నయ్	ముంబై	17.04	17.05
22.	57273	ప్రతిరోజు	హుబ్లీ	తిరుపతి(ప్యాసింజరు)	17.04	17.05
23.	12708	సో/గు/శని	నిజామొద్దీన్	తిరుపతి	18.33	18.35
24.	17430	ప్రతిరోజు	తిరుపతి	హైదరాబాదు	19.00	19.05
25.	11043	శుక్ర	లోకమాన్యతిలక్	మధురై	19.33	19.35
26	12798	ప్రతిరోజు	చిత్తూరు	కాచిగూడ (వెంకటాద్రి)	21.08	21.10
27	11027	ప్రతిరోజు	ముంబై	చెన్నయ్(మెయిల్)	21.33	21.35
28.	17651	ప్రతిరోజు	చెన్నయ్, ఎగ్మోర్	కాచిగూడ	22.14	22.15
29.	17415	ప్రతిరోజు	తిరుపతి	కొల్హాపూర్(హరిప్రియ)	23.38	23.40

కడప రైల్వేస్టేషన్ విచారణ కేంద్రం నెం. 08562-242131

విద్యుత్ శాఖ ఫోన్ నెంబర్లు

ఫ్యూజ్ ఆఫ్ కాల్ (నార్త్)	242355
ఫ్యూజ్ ఆఫ్ కాల్ (సౌత్)	241756
ఫ్యూజ్‌ఆఫ్ కాల్ (వెస్ట్)	241418
ఫ్యూజ్ ఆఫ్ కాల్ (ఈస్ట్)	277455
ఏఇ (విద్యుత్ భవన్)	257344
ఏఇ ఆపరేషన్స్	244873

అత్యవసర సర్వీసులు

ఎమర్జెన్సీ (ఆల్‌సర్వీసెస్)	108
ఎలక్ట్రిసిటీ	1912
వాటర్ వర్క్స్	241898, 243104
ఏపిఎస్‌ఆర్‌టిసి ఎంక్వైరీ	244160, 7382925080
ఏపిఎస్‌ఆర్‌టిసి రిజర్వేషన్	243402
రైల్వే ఎంక్వైరీ	242131, 131
ఆల్‌ఇండియా రేడియో	244196
హెడ్‌పోస్టాఫీసు	241600

కడప నుంచి ప్రధాన నగరాలకు వెళ్లే బస్సుల వేళలు

జిల్లా కేంద్రమైన కడప నుంచి రోజూ హైదరాబాద్, విజయవాడ, బెంగుళూరు, చెన్నయ్, శ్రీశైలం, నెల్లూరు, అనంతపురం, కర్నూలు ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయపాలన వివరాలు ఇలా...

బస్సు	సమయం
హైదరాబాదు	
డీలక్స్	06.15
సూపర్ లగ్జరీ	08.30
సూపర్ లగ్జరీ	09.30
సూపర్ లగ్జరీ	10.30
సూపర్ లగ్జరీ	11.30
ఎక్స్‌ప్రెస్	14.30
సూపర్ లగ్జరీ	20.00
సూపర్ లగ్జరీ(బిహెచ్ఇఎల్)	20.30
సూపర్ లగ్జరీ (కెపిహెచ్‌బి)	21.00
సూపర్ లగ్జరీ (జెడిఎంటి)	21.30
సూపర్ లగ్జరీ (ఇసిఐఎల్)	22.00
ఇంద్ర	22.30
సూపర్‌లగ్జరీ	22.45
బెంగుళూరు	
సూపర్ లగ్జరీ	00.30
ఎక్స్‌ప్రెస్	04.30
ఎక్స్‌ప్రెస్	07.00
సూపర్ లగ్జరీ	07.40
సూపర్ లగ్జరీ	08.30
ఇంద్ర	10.30
సూపర్ లగ్జరీ	11.30
డీలక్స్	14.30
సూపర్ లగ్జరీ	20.15
సూపర్ లగ్జరీ	22.00
సూపర్ లగ్జరీ	22.15
సూపర్ లగ్జరీ	22.30
సూపర్ లగ్జరీ	22.45
సూపర్ లగ్జరీ	23.00
ఇంద్ర	23.30
విజయవాడ	
సూపర్ లగ్జరీ	08.00
సూపర్ లగ్జరీ	09.00
సూపర్ లగ్జరీ	10.30
సూపర్ లగ్జరీ	18.30
సూపర్ లగ్జరీ	20.00
ఇంద్ర	21.00
సూపర్ లగ్జరీ	21.30
సూపర్ లగ్జరీ	22.00
ఇంద్ర	22.15
చెన్నయ్	
సూపర్ లగ్జరీ	08.40
సూపర్ లగ్జరీ	11.30
సూపర్ లగ్జరీ	21.30
సూపర్ లగ్జరీ	22.30
సూపర్ లగ్జరీ	23.30

♦ **కడప నుంచి శ్రీశైలంకు ఎక్స్‌ప్రెస్ ఉదయం 5.30, మధ్యాహ్నం 13.30 గంటలకు**

♦ **కడప నుంచి నెల్లూరు :** ఉదయం 4.00, 5.00, 6.00, 6.30, 7.00, 8.00, 8.30, 9.15, 10.00, 10.30, 11.00, 11.30, మధ్యాహ్నం 12.30, 1.30, 2.00, 2.30, 3.00, 3.30, 4.00, 4.30, 5.00, సాయంత్రం 6.00, 6.30గంటలకు

♦ **అనంతపురం :** ఉదయం 4.30, 5.00, 5.00, 6.30, 7.00, 8.00, 8.40, 9.00, 9.45, 10.25, 10.45, 11.15, 11.30, మధ్యాహ్నం 12.00, 12.20, 1.00, 1.30, 2.00, 2.15, 2.20, 3.15, 3.30, 4.30, సాయంత్రం 5.00, 5.15, 6.30, 7.30

♦ **కడప నుంచి కర్నూలు :** అర్ధరాత్రి 12.30, 12.45, 1.00, 1.30, 1.45, 2.00, 2.15, 2.45, 3.00, 3.20, 3.30, 3.45, ఉదయం 4.00, 4.30, 5.30, 6.00, 7.30, 8.00, 8.45, 9.00, 9.45, 10.00, 10.30, 10.45, 11.15, 11.30, 11.45, మధ్యాహ్నం 12.00, 12.30, 1.00, 1.20, 1.45, 2.00, 2.30, 3.30, 4.00, 4.30, 5.00, 5.30, రాత్రి 11.15. 11.35

విచారణ కేంద్రం ఫోన్ నెంబరు 08562-244160

9న ధర్నా : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కాంట్రిబ్యుటరీ పెన్షన్ విధానం (సిపిఎస్) రద్దు చేయాలని కోరుతూ జనవరి 9న తాలూకా కేంద్రాల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. స్తానిక ఎపిటిఎఫ్ కార్యాలయంలో బుధవారం ఉపాధ్యాయుల నుద్దేశించి ఆయన మాట్లాడారు. పెన్షన్ సాధన సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా రూ.40లక్షల మంది రాష్ట్రంలో లక్షా 86వేల మంది ఉద్యోగ ఉపాధ్యాయులు సిపిఎస్ పథకం పరిధిలో ఉన్నారన్నారు. సిపిఎస్ విధానం వల్ల సామాజికంగా, ఆర్థికంగా భద్రత కరువు అవుతుందన్నారు. పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగికి పెన్షన్ ఇవ్వడం ప్రభుత్వాల కనీస బాధ్యతని 1980లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును గుర్తు చేశారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎమ్ఎఫ్), ప్రపంచ బ్యాంకు ఒత్తిడికి తలొగ్గి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిపిఎస్ విధానం తీసుకు రావడం అప్రజాస్వామికం అన్నారు. సిపిఎస్ విధానం వల్ల ప్రతి ఉద్యోగి వేతనం నుంచి ప్రతినెల కనిష్టంగా రూ. 3వేల నుంచి రూ.5వేల వరకు మినహాయిస్తున్నారన్నారు. ఈ మొత్తానికి జవాబుదారీతనం లేదన్నారు. సిపిఎస్ విధానం రద్దు అయ్యేంత వరకు పోరాటం సాగిస్తామని శ్యామ్‌సుందర్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గురయ్య, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సావిత్రిబాయ్ పూలే జయంతి వేడుకలు

ప్రజాశక్తి - నందలూరు

భారతదేశ మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయుని సావిత్రిబాయ్ పూలే 187వ జయంతి వేడుకలను నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైభవంగా నిర్వహించారు. బుధవారం కేక్‌ను కట్ చేసి ఉపాధ్యాయులకు పంచిపెట్టారు. జన విజ్ఞాన వేదిక నాయకులు ఉప్పలూరు జయరామయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమాదేవి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి బాధ్యతగా పనిచేసి వృత్తి ధర్మాన్ని పాటిస్తూ సావిత్రిబాయ్ పూలేను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రౌఫ్‌బాష, రామిరెడ్డి, ఐజయ్య, జయచంద్రరాజు, రామకృష్ణంరాజు, చక్రపాణి, శీను, మూర్తి, సరోజిని, పుణ్యవతి, వసంత, రామానుజమ్మ, అరుణ, శివశంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాశినాయనలో... సమాజంలో బాలికలు విద్యలో ధైర్యంగా ముందుకు వెళ్లాలని ఎపి మోడల్ స్కూల ప్రిన్సిపాల్ శ్యామలాదేవి అన్నారు. బుధవారం సావిత్రి బాయి పూలే 187 జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో మోడల్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందినవారికి స్టడి మెటీరియల్‌ను, ఇతర బహుమతులను శ్యామలాదేవి చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సావిత్రిబాయ్‌పూలే లాగా బాలికలు ధైర్యంగా ముందుండి సంస్క రణలకు నడుంబిగించాలని కోరారు. మూఢాచార సమాజం నుంచి ఎన్నో కష్టాలను ఎదుర్కొని సావిత్రిబాయి విజయం సాధించారన్నారు. మహిళలు సామాజి కంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే సావిత్రిబాయ్ ఆశయాలు సాధించినట్లు కార్యక్రమంలో లక్ష్మిరెడ్డి, రాజారెడ్డి, నారాయణరెడ్డి, విజయరామిరెడ్డి, జోజయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించండి

అధికారులకు మంత్రి ఆదినారాయణరెడ్డి ఆదేశం



మాట్లాడుతున్న మంత్రి ఆదినారాయణరెడ్డి

ప్రజాశక్తి- జమ్మలమడుగు

ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని మార్కెటింగ్ శాఖా మంత్రి సి. ఆదినారాయణరెడ్డి అన్నారు. బుధ వారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలో మొత్తంకోటి 40లక్షల రేషన్‌కార్డులు మంజూరు చేశారన్నారు. కన్నెలూరు నుంచి ముద్దనూరు బైపాస్ రోడ్డు వరకు రోడ్డు పనులు త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. మార్చిలో మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీరు వదులుతామని చెప్పారు. సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. బోర్లు ఎండిపోకుండా ఉంటాయన్నారు. రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేసి రైతులు అభివృద్ధి కోసం పాటుపడుతుందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా అర్హులకు ముఖ్యమంత్రి సహాయనిధి అందిస్తున్నామని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం ఇస్తున్నామని చెప్పారు. తమ ట్రస్టు ద్వారా మహిళలకు శిక్షణ అనంతరం 500 కుట్టుమిషన్లు ఇచ్చామన్నారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ తాతిరెడ్డి తులసి, మున్సిపల్ కమిషనర్ లక్ష్మీరాజ్యం, తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, మున్సిపల్ డిఇ వేణుగోపాల్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ గౌసియాబేగం, అంగన్‌వాడీ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వేతన బకాయిలు మంజూరు చేయండి

మున్సిపల్ చైర్మన్‌కు కార్మికులు వినతి



చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వేతన బకాయిలు త్వరగా మంజూరు చేయాలని మున్సిపల్ కార్మికులు కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డిని కలిసి కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ 2016 ఆగస్టు 8న ప్రతి కార్మికునికి రూ. 12వేలు వేతనం ఇవ్వాలని, ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం వారు గుర్తు చేశారు. కానీ గత ఏడాది ఆగస్టు 8నుంచి కనీస వేతనం రూ. 12వేలు మంజూరు చేశారని మిగిలిన బకాయి ఒక్కొక్క కార్మికునికి 11నెలల మొత్తం రూ.11వేలు మంజూరు చేయాలని కోరారు. సంక్రాంతి పండుగ లోపల ఈ బకాయిలు అందజేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కార్మికులు మృతి చెందితే దహన సంస్కారానికి రూ. 10వేలు మంజూరు చేయాలన్న నిబంధన అమలు కావడం లేదన్నారు. ప్రతినెల 5వతేది నాటికి వేతనాలు ఇవ్వాలని చెబుతున్నా ఆలస్యంగా ఇస్తున్నట్లు వారు తెలిపారు. ఏడు నెలల కిందట ఇంజనీరింగ్ సెక్షన్‌లో పని చేస్తున్న కార్మికుడు సుబ్బరాయుడు మృతి చెందితే ఆయన భార్యకు పని ఇచ్చారనీ, ఆమెకు ఇంత వరకు జీతం ఇవ్వలేదని అన్నారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని వారు కోరారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సాల్మన్, రమణమ్మ, మరియమ్మ, శాంతి, నీతమ్మ, రమాదేవి, చైర్మన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

శాంతియుత ఉద్యమాలే పరిష్కార మార్గం



మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

శాంతియుత ఉద్యమాలే పరిష్కార మార్గమనే భావనతో వీరవనిత సావిత్రిబాయ్‌పూలే అన్నారని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మేకల ఆంజనేయులు పేర్కొన్నారు బుధవారం సావిత్రిబాయిపూలే 187వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే ధర్మపత్ని అయిన సావిత్రిబాయ్ హైందవ మత కట్టుబాట్లను ధిక్కరించి బాలికా, వితంతువు విద్యను ప్రోత్సహించిన ధీశాలి అన్నారు. భార్యాభర్తలు కలిసి సత్యశోధక్ సమాజాన్ని స్థాపించి బడుగు, బలహీన వర్గాల వారిని ఆదుకున్న మానవతావాదులు అన్నారు. తొలిమహిళా ఉపాధ్యాయురాలు అయిన సావిత్రిబాయి అప్పట్లో ఇతరుల నుంచి ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నప్పటికీ బాలికా విద్యను ప్రోత్సహించారని తెలిపారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే సావిత్రిబాయ్ ఆశయాలు సాధించినట్లు అన్నారు. అనంతరం ఎస్‌సి పాఠశాలలోని ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు నూకల లక్ష్మీనారాయణ, వైసిపినాయకులు నరసింహులు, వకీలు భూతమాపురం సుబ్బారావు, ఉపాధ్యా యులు దేవమణి, మహబూబ్‌బీ, కౌసల్య మీనాదేవి, స్వర్ణకుమారి, లీలావతి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో... సావిత్రిబాయి మహిళలకు ఆదర్శమని డిప్యూటి డిఇఒ శ్యామలమ్మ తెలిపారు. స్థానిక హోమస్‌పేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయ్ పూలే జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా శ్యామలమ్మ మాట్లాడుతూ ఆనాడు మూఢాచార సమాజం నుంచి ఎన్నో కష్టాలను ఎదుర్కొని సావిత్రిబాయి విజయం సాధించారన్నారు. ఆమె జన్మదినాన్ని మహిళ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. సమాజ సంక్షేమం కోసం సత్యశోదక్ సమాజాన్ని స్థాపించి సేవలందించారన్నారు. ప్రధానోపాధ్యాయుడు రవీంద్రుడు, ఉపాధ్యాయుడు సుందరం మాట్లాడుతూ పూలే దంపతులకు సంతానం లేకపోవడం వల్ల అనాథ బాలుడిని దత్తతకు తీసుకున్నట్లు తెలిపారు. మహిళ విద్యావంతురాలైతే సమాజం బాగుపడుతుందనే ఉద్దేశ్యంతో 1849, జనవరి 1న పూణేలో బాలికల పాఠశాల ప్రారంభిం చారన్నారు. ముస్లిం వర్గానికి చెందిన ఓ వ్యక్తి పాఠశాల భవనాన్ని పూలేకు ఉచితంగా ఇచ్చిన విషయాన్ని వారు గుర్తు చేశారు. మహిళలకు విద్య అనవసరమని అగ్రకులాల వారు వ్యతిరేకించి సావిత్రిబాయి పూలేను పలు విధాలుగా అవమానించినా అన్నింటిని ఎదిరించి నిలిచారని తెలిపారు. కార్యక్రమం అనంతరం యుటిఎఫ్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు.



యుటిఎఫ్ క్యాలెండరును ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు



ముఖ్యమంత్రితో మాట్లాడుతున్న ప్రవీణ్

స్టీల్ ఫ్యాక్టరీకై సిఎంను కలిసిన ప్రవీణ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జిల్లాలో స్టీల్‌ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని స్టీల్‌ప్లాంట్ సాధన సమితి అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి అభ్యర్థించారు. 5వ విడత జన్మభూమి కార్యక్రమానికి ముఖ్యమంత్రి బుధవారం పులివెందుల ప్రాంతానికి హాజరైన సందర్భంలో ప్రవీణ్‌కుమార్ కలిసినట్లు స్థానిక విలేకరులకు తెలిపారు. సిఎంకు వినతిపత్రం సమర్పించామన్నారు. కడపజిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించి ప్రజల ఆకాంక్ష నెరవేర్చాలని విన్నవించినట్లు తెలిపారు. ఇందుకు సానుకూలంగా ముఖ్యమంత్రి స్పందించి కడప జిల్లాకు త్వరలోనే ఉక్కు ఫ్యాక్టరీ వస్తుందనీ, ఇక్కడి యువత భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తామని హామీ ఇచ్చినట్లు ప్రవీణ్ కుమార్‌రెడ్డి తెలిపారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఖాజా

పేదవారిని ఆదుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పేదరికంలో ఉన్న వారిని ప్రతి ఒక్కరు ఉన్నంతలో ఆదుకోవాలని వైసిపి మైనార్టీ నాయకులు ఆయిల్ మిల్ ఖాజా అన్నారు. ఇస్లాంపురం వీధికి చెందిన షేక్ జిలాన్ (చాన్) అను పేద వ్యక్తికి పక్షవాతం వచ్చి నడవలేని స్థితిలో ఉన్నాడు. అతనికి ఆయిల్ మిల్ ఖాజా బుధవారం రూ.25వేలు ఆర్థిక సహకారాన్ని అందించారు. ఈసందర్భంగా ఖాజా మాట్లాడుతూ షేక్‌జిలాన్ ఫిజియోథెరఫికి అయ్యే ఖర్చును కూడా భరిస్తానన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని ప్రతి ఒక్కరు సమసమాజ స్థాపనకు తమవంతు కృషిని అందజేయాలని ఆకాంక్షించారు.

ఆడా, మగా సమానమే

ప్రజాశక్తి - కాశినాయన

సమాజంలో ఆడా, మగా సమానంగా జీవించినప్పుడే మహిళలు అభివృద్ధి చెందుతారని ఎపి మహిళ సమతా సొసైటీ అధ్యక్షులు అన్నారు. మండలంలోని వరికుంట్ల కస్తూరిబా పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం, పరిశుభ్రత, జండర్‌కు సంబంధించిన విషయాలపై క్షుణంగా వివరించారు. సమాజంలో మహిళను సమానంగా గౌరవించాలన్నారు. ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరం అవుతాయన్నారు. భ్రూణహత్యలకు పాల్పడవద్దన్నారు. ఆడపిల్ల ఇంటికి వెలుగనీ, ఆడపిల్లలను ప్రోత్సహిస్తే మగపిల్లలకు ఏ విధంగానూ తీసిపోరని చెప్పారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి ఆడ, మగా అన్న బేధం లేకుండా చిన్నతనం నుంచి పిల్లలను పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతా బోగస్

అవుట్ సోర్సింగ్‌లో పేర్లుంటాయి, కార్మికులుండరు
మున్సిపల్ కార్పొరేషన్‌లో నిర్వాకం

ప్రజాశక్తి - కడప సిటీ ప్రతినిధి

మున్సిపల్ కార్పొరేషన్‌లో ఓ ప్రధాన విభాగానికి చెందిన ఓ అధికారి చేసిన అవినీతిని చూస్తే ఆశ్చర్యం కలుగక మానదు. అతని రూటే సపరేటు. ఎంతటివారినైనా ఇట్టే తన మాటలతో ఆకట్టుకోగల సామర్థ్యం అతనిది. సారు చేసే పనులకు ఏమాత్రం అడ్డూ అదుపూ ఉండదు. అవినీతిలో అందెవేసిన చేయి అతనిది. రాముడు మంచి బాలుడు అన్న పద్ధతిలో పైకి కనిపించినా ఆయన చేసే వ్యవహారం మాత్రం చాలా ఆశ్చర్యానికి గురిచేస్తుంది. అవినీతి అంటే ఎరుగరేమో అన్న ఫోజులు ఇస్తుంటారు. ముక్కుసూటిగా వ్యవహరిస్తారన్న వీరలెవల్ ప్రదర్శిస్తుంటారు. అలాంటి వ్యక్తి చేసే పనులను చూస్తే దిమ్మతిరిగిపోతుందంటే అతిశయోక్తి కాదు.

ఆయన రూటే సపరేటు

అతని పరిధిలో దాదాపు వెయ్యి మందికి పైగా సిబ్బంది పని చేస్తుంటారు. ఇందులో భాగంగా నగరంలో పని చేసే ఆ సిబ్బందిని నిర్వహించడంలో ఆయనది కీలక బాధ్యత. ఈ మేరకు సిబ్బందిని నియమించుకోవడంలో తనది కీలక పాత్ర. సాధారణంగా అవుట్ సోర్సింగ్ వారిని నియమించుకోవడంలో ఏజెన్సీలు పాత్ర వహిస్తున్నా వారి పాత్ర నామమాత్రమే అనిచెప్పొచ్చు. తనకు కావాల్సిన వారిని నియమించుకునేందుకు ఏజెన్సీలతో ముందే ఒప్పందం కుదుర్చుకుంటున్నాడు. బోగస్ పేర్లను పొందిపరిచి వారి జీతాలను తానే డ్రాచేసుకుంటున్న పరిస్థితి.

అక్రమ వ్యవహారం తీరిదీ..

అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియమితులైనట్లు జాబితాలో పేర్కొంటున్నారు. నిజానికి క్షేత్ర స్థాయిలో జరిగే పని వద్ద ఈ కార్మికులు పని చేయరు. ముందుగానే ఆ కార్మికులతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం వారి ఎటిఎం కార్డులు ఆ అధికారి వద్దే ఉంచుకుంటాడు. నెల జీతాలు ఖాతాలకు చేరిన వెంటనే వారి ద్వారా సంతకాలు రిజిస్టర్లలో పెట్టించుకుని మొత్తం సింహభాగం సొమ్మును తాను తీసుకుని కొద్ది మొత్తాన్ని కార్మికులకు ఇస్తున్నారు. ఇలాంటి వారు చెమ్ముమియాపేట, అక్కాయపల్లి జోన్‌లో అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు 63 మంది ఇలాంటి వారు ఉన్నారు. ఇదే పరిస్థితి మిగిలిన జోన్లలో కూడా కొనసాగుతోంది. కొంతమంది గల్ఫ్‌లో ఉంటున్న వారి పేరుతో కూడా జీతాలను డ్రాచేస్తున్నారన్న వినికిడి ఉంది. ఇది ఇలా ఉంటే పర్మినెంటు కార్మికులు కొందరు పనిలో లేకండా బదులు కార్మికులుగా నియమించుకుని జీతం పొందుతున్నారు. దీనిలో నుంచి కూడా ఆ అధికారికి ఆమ్యామ్యాలు ముడుతున్నాయి. ఈ పద్ధతిలో తన అవినీతిని మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా తన దందాను కొనసాగించారు. ఇవేకాకుండా కార్పొరేషన్‌లో సిబ్బంది రక్షణ పరికరాలు, వివిధ ఇతర ఆరోగ్య సంరక్షణ నిధులను కూడా అక్రమంగా జేబునింపుకుంటున్నాడన్న విమర్శ తీవ్రంగా వారి సిబ్బంది నుంచే వినిపిస్తుండడం గమనార్హం. తనకు వచ్చే జీతంతో సంబంధంలేకుండా వివిధ అక్రమ మార్గాల ద్వారా వచ్చే ఆదాయమే నెలకు రూ.5 లక్షలు పైబడి ఉంటుందని అంచనా.

గుండెల్లో రైల్లు పరుగు

ఇటీవలే పింఛన్ పంపిణీలో చోటు చేసుకున్న అవినీతిపై కొత్తగా వచ్చిన కమిషనర్ పెద్ద ఎత్తున ప్రక్షాళనకు దిగారు. ఈ మేరకు కలెక్టరు దాదాపు 30 మంది రెగ్యులర్, మరో ఏడుగురు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై కూడా చర్యలకు పూనుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి పెద్ద ఎత్తున ప్రశంసలు అందాయి. తనపైశ్రీవ ఈ ప్రభావం ఎక్కడ పడుతుందోనన్న భయం ఆ అవినీతి అధికారిని వెన్నాడుతోంది. ఇదే పద్ధతిలోనే ఈ అవినీతి భాగోతంపై కూడా దృష్టి సారిస్తే మరిన్ని విషయాలు బయటికొచ్చే అవకాశం ఉంది.



సుభద్రమ్మకు అవార్డు అందజేస్తున్న గంటా శ్రీనివాసరావు

సుభద్రమ్మకు అవార్డు ప్రదానం

ప్రజాశక్తి - చెన్నూరు

ఐఇఆర్‌టి ఉపాధ్యాయులు సుబ్బమ్మ బుధవారం విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో సావిత్రిబాయిపూలే రాష్ట్ర ఉత్తమ మహిళా ఉపాధ్యాయ అవార్డును మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆశాఖ ఎస్‌పిడి శ్రీనివాస్ చేతుల మీదుగా అందుకున్నారు. ఆమె చెన్నూరులోని ఐదవవార్డులోని ఐఇఆర్‌టి కేంద్రంలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల ఉన్నతికి విశేష సేవలు అందించడంతో వార్డు ఎన్నిక అయింది. అవార్డులో భాగంగా బంగారు పతకం, రూ.10వేలు నగదు, ప్రశంసాపత్రం, ట్యాబ్ ఇచ్చి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల అభ్యున్నతికి అంకిత భావంతో పని చేయడం వల్లే తనకు ఈ గౌరవం లభించిందని తెలిపారు. ఈ అవార్డుతో మరింత బాధ్యత తనపై పెరిగిందని చెప్పారు.

ఆర్‌టిపిపిలో కాంట్రాక్ట్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి - యర్రగుంట్ల

ఆర్‌టిపిపిలో బుధవారం కాంట్రాక్ట్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్ధనగ్న ప్రదర్శనతో ర్యాలీ నిర్వహించారు. న్యూగేటు వద్ద నుంచి ర్యాలీగా పవర్‌హౌస్ మెయిన్ గేటు వరకు వెళ్ళి అక్కడ నిరసన వ్యక్తం చేశారు. ఎపి కాంట్రాక్ట్ కార్మికుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సిఐటియు, ఎఐటియుసి, 1535, హెచ్-129, వైఎస్ఆర్ సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. గత నెల 17వతేది నుంచి 27వతేది వరకు నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జాక్ చైర్మన్ పుల్లారెడ్డి మాట్లాడుతూ కార్మికులకు విద్యుత్ సంస్థలోకి విలీనం చేసి సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.తమ డిమాండ్లు నేరవేర్చే వరకు ఆందోళనలు, నిరసనలు తెలుపుతామని అన్నారు. ప్రభుత్వం స్పందించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు.

సిఎం తగిన మూల్యం చెల్లించక తప్పదు : సిపిఐ

ప్రజాశక్తి - కడపఅర్బన్

జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏప్రిల్ 6 నాటికి శంకుస్థాపన చేయకపోతే ముఖమంత్రి చంద్రబాబు నాయుడు తగిన మూల్యం చెల్లించకతప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య హెచ్చరించారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు ఉద్యమాన్ని ఉక్కుపాదాలతో అణిచి వేస్తున్నారని విమర్శించారు. ఏప్రిల్ 7న మహాప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. పోలీసులు అక్రమంగా నాయకులు బ్రహ్మం, వెంకటట్రామ్‌ను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. గతంలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి అమలు చేయలేదని విమర్శించారు.

రేపు ఇంటర్వ్యూలు

కడపఅర్బన్ : జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఈనెల 5న సేల్స్ రెప్రజెంటేటివ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు అధికారి ఎన్.రామమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటలకు వినూత్న ఫర్టిలైజర్స్ కంపెనీ ప్రయివేట్ లిమిటెడ్ వారు హాజరవుతారని పేర్కొన్నారు. 19 నుంచి 30 సంవత్సరాల లోపు వయసు ఉన్నవారు హాజరు కావాలని తెలిపారు. పది పాస్, ఫెయిల్/ ఏదైనా డిగ్రీ ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు.

మహిళాభ్యున్నతికి విద్యే ప్రధానం

వైవీయూ విసి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - కడపఅర్బన్



మాట్లాడుతున్న విసి రామచంద్రారెడ్డి

మహిళాభ్యున్నతికి విద్యే ప్రధానమని వైవీయూ విసి రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం వైవీయూలోని డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం కేంద్ర గ్రంథాలయ భవన సముదాయంలోని సెమినార్ హాలులో సావిత్రిబాయి పూలే 187వ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయిపూలే ఆశయాలను నేటి మహిళలు కొనసాగించాలని పిలుపు నిచ్చారు. ప్రతి మహిళ ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ఆ దిశగా శ్రమించాలని కోరారు. ప్రిన్సిపల్ సత్యనారాయణ మాట్లాడుతూ స్త్రీ విద్యాభివృద్ధికి, నిమ్నవర్గాల అభివృద్ధికి సావిత్రిబాయి పూలే విశేషకృషి చేశారని చెప్పారు. ఎంబిఎ విభాగ సహాయ ఆచార్యులు డాక్టర్ గంగయ్య మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే అని పేర్కొన్నారు. తెలుగు విభాగ సహాయఆచార్య డాక్టర్ ఎం.వినోదిని మాట్లాడుతూ మహిళా సాధికారికతకు సావిత్రిబాయి పూలే విశేషంగా కృషి చేశారని చెప్పారు. సమాజంలోని బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలకు విద్యాబుద్ధులు నేర్పించి వారిని సమాజ స్రవంతిలో భాగస్వామ్యం చేసేందుకు సావిత్రిబాయిపూలే చేసిన కృషిని ప్రతి ఒక్కరు గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ సుభాష్, మునికుమార్, రామకృష్ణారెడ్డి, నజీర్ అహమ్మద్, చంద్రమతి శంకర్, సహాయ ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు, పి.జి. విద్యార్థులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థి సంఘాల నాయ కులు, బిసి వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రాజకుళ్లాయప్ప, ప్రధాన కార్యదర్శి హరికృష్ణ పాల్గొన్నారు.

రుగ్మతల నిర్మూలనకు సావిత్రీబాయి పూలే కృషి

యుటిఎఫ్, జెవివి నాయకులు

ప్రజాశక్తి - కడపఅర్బన్

సమాజంలో ఉన్నటువంటి రుగ్మతలను నిర్మూలించేందుకు సావిత్రిబాయి పూలే అని యుటిఎఫ్, జెవివి నాయకులు పేర్కొన్నారు. నగరంలోని చెమ్మూమియా పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పి.విజయారెడ్డి సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి సావిత్రిబాయి జీవితాన్ని త్యాగం చేశారని పేర్కొన్నారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఎస్.వి.సుబ్బరాజు మాట్లాడుతూ సమాజంలో మహిళల అభ్యున్నతి కోసం విద్య అవసరమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇ.రామమూర్తి, సి.వాణి, మేరీ, బాబు, చెన్నయ్య, గణేష్ పాల్గొన్నారు.

జెవివి ఆధ్వర్యంలో ఆలంకాన్ పల్లెలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జెవివి సాంస్కృతిక విభాగం కన్వీనర్ ఎ.డి.దేవదత్తం, హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

27 విద్యుత్ కార్మికుల సమ్మె

ఐక్య వేదిక నాయకుల హెచ్చరిక

ప్రజాశక్తి - కడపఅర్బన్

ప్రభుత్వం విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 27న సమ్మె తప్పదని విద్యుత్ కార్మికుల ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం విద్యుత్ ఆపరేషన్ డిఇ కార్యాలయం ఎదుట నాయకులు, కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9న విద్యుత్ ఎస్‌సి కార్యాలయం ఎదుట భోజన విరామములో నల్లబ్యాడ్జీలతో నిరసన ఉంటుందని తెలిపారు. సమానపనికి సమానవేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు రెగ్యులర్ చేయాలన్నారు. పీసురేటు వద్దని పేర్కొన్నారు. రూ.20లక్షలు ప్రమాద బీమా, మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. విద్యుత్ రంగాన్ని ప్రయివేట్ పరం చేయవద్దని డిమాండ్ చేశారు. గతంలో పలుమార్లు ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. విధిలేని పరిస్థితుల్లో ఆందోళనలు, నిరసనలు చేపట్టామనీ, చివరికి సమ్మె వరకు వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. కాంట్రాక్ట్ కార్మికులతో పని చేయించకూడదని నిబంధన ఉన్నప్పటికీ యాజమాన్యం మొండిగా వారితో వెట్టి చాకిరి చేయిస్తూ శ్రమను దోచుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐక్యవేదిక కన్వీనర్ డి.రమేష్, కో-కన్వీనర్లు హరిప్రసాద్, గురు ప్రసాద్; సి.వి.సుబ్బయ్య, లలితమ్మ, పరమేశ్వర, ఇస్మాయిల, గణేష్, కోశాధికారి యాద్ర, యుఇఇయు డిస్కం కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, మాజీ కార్యదర్శి శివశంకర్, ఒసి సంఘం నాయకులు రమేష్‌రెడ్డి, ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ నాయకులు శ్రీపతి, 1104 నాయకులు సి.వి.సుబ్బయ్య, విద్యుత్ కార్మికుల సంఘం డివిజన్ అధ్యక్షులు రామకేశవ, కోశాధికారి కిషోర్‌బాబు, సహాయ కార్యదర్శి నాయక్, సుబ్బారెడ్డి, శేఖర్, ట్రాన్స్‌కో నాయకులు ఎం.సురేష్, మధుసూదన నాయకుడు పాల్గొన్నారు.



డిఇ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న నాయకులు, కార్మికులు